


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 17-05-2019 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 214 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# మహాగత్‌బంధన్

- మెజారిటీ రానిపక్షంలో కార్యాచరణ
- ఫలితాల రోజే మహాకూటమి సమావేశం
- యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ



దిల్లీ: కాంగ్రెస్ సారథ్యంలో పలు ప్రతిపక్ష పార్టీలు ఏకమై మహాగత్‌బంధన్ కూటమిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 19న చివరిదశ పోలింగ్ జరగనుంది. ఇప్పుడు ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పూర్తిస్థాయి మెజారిటీ రానిపక్షంలో తదుపరి కార్యచరణపై సమీక్షించేందుకుగాను మే 23న ఎన్నికల ఫలితాల విడుదల రోజే గత్‌బంధన్ కూటమి సమావేశం అయ్యేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగానే డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, జేడీఎస్ అధినేత దేవెగౌడ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్, బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌లతో సోనియా మాట్లాడినట్లు తెలుస్తోంది. 2017లో రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేసిన అనంతరం యూపీఏ ఛైర్‌పర్సన్‌గా ఉన్న సోనియా గత్‌బంధన్ కూటమి ఏర్పాటులో చురుగ్గా వ్యవహరిస్తూ ముందుకు కదులుతున్నారు.

గత్‌బంధన్ కూటమి తెరపైకి వచ్చినప్పటి నుంచి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ కూటమికి అనుకూలంగా ఉన్న విషయం తెలిసిందే. భాజపా నేతృత్వంలోని ఎన్డీయేని గద్దెదించడమే ప్రధాన తరువాయి 2లో..

## కొత్త విషయాలు నేర్చుకుంటూనే, సమస్యలను
# అధిగమించాలి

- వ్యవసాయరంగంపై దృష్టి పెట్టాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు







హైదరాబాద్: జీవితంలో ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటూనే ముందున్న సమస్యలు అధిగమించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. బేగంపేటలోని అణుశక్తి విభాగం, అణు ఖనిజ డైరెక్టరేట్ పరిశోధన సంస్థ 70ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శాస్త్రవేత్తలతో సమావేశమైన ఆయన వారు చేస్తున్న కృషిని అభినందించారు.

ప్రజలకు ఉపయోగపడేలా వివిధ కొత్త పరిశోధనలు, ఆవిష్కరణలు చేయాలన్న ఆయన వ్యవసాయరంగంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల్లో కాలుష్యంపై అవగాహన తీసుకురావాలని, సాధ్యమైనంత వరకూ నగరాల్లో ప్రజా రవాణాకు ఎక్కువ తరువాయి 2లో..

## ఆందోళనకరంగా ఈసీ తీరు



అమరావతి: పశ్చిమ బెంగాల్‌లో భాజపా నేతలు, అమిత్ షా ఫిర్యాదులపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించడం, టీఎంసీ నేతల ఫిర్యాదులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోందని ఏపీ సీఎం, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ట్విట్టర్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నియోజక వర్గంలో కనీసం 50శాతం వీవీప్యాట్లను లెక్కించాలని తరువాయి 2లో..

## గుండాల్లా టీఎంసీ కార్యకర్తలు

- ఈశ్వరచంద్ర విగ్రహం ధ్వంసం చేశారు
- పడగొట్టిన చోటే పెద్ద విగ్రహం కట్టిస్తా
- ప్రధాని నరేంద్ర మోదీ



మవు: తుది విడత ఎన్నికల ప్రచారానికి శుక్రవారంతో తెరపడనుండటంతో మోదీ తన మాటల దూకుడు పెంచారు. ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ గుండాగిరితో పాటు యూపీలో హత్యకేసులో పరారీలో ఉన్న వ్యక్తికి ఎస్పీ-బీఎస్పీ టిక్కెట్ ఇవ్వడాన్ని తప్పు పట్టారు. గురువారం ఉత్తర్రపదేశ్‌లోని మవులో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ తరువాయి 2లో..



## ప్రజాదర్బార్‌లో జగన్ బిజీబిజీ

### జగనన్నను కలిసిన రమణ దీక్షితులు

కడప: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప జిల్లా పులివెందుల పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. కాగా.. గురువారం సాయంత్రం తిరుమల మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు దీక్షితులు ఆశీస్సులు అందించారు. జగన్‌తో పాటు వైసీపీ నేతలు, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉన్నారు. ఇదిలా ఉంటే.. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పులివెందులకు వెళ్లిన విషయం తెలిసిందే. పులివెందులలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు.




## మల్లన్నసాగర్‌ను ఆపే ప్రసక్తే లేదు

### పరిహారంలో అన్యాయం జరగనివ్వం .. తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్: మల్లన్న సాగర్ ప్రాజెక్టును ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. నిర్వాసితుల పిటిషన్‌పై గురువారం విచారించిన ఉన్నత న్యాయస్థానం పరిహారం తీసుకోవాలని వారికి సూచించింది. పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగితే తమ వద్దకు రావొచ్చని పేర్కొంది. ఈ మేరకు పరిహారం తీసుకోని చెక్కులను 46 మంది నిర్వాసితుల తరఫు న్యాయవాదికి ప్రభుత్వం అందజేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై దాఖలైన అన్ని పిటిషన్లనూ కలిపి విచారిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి తరువాయి 2లో..




# ఓట్ల కౌంటింగ్ పటిష్టంగా జరగాలి

- 33 గదుల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- సీపీ మహేష్‌చంద్ర లడ్డా సహా కలెక్టర్ పరిశీలన
- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణ వేదిక
- కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్



విశాఖపట్నం: ఈ నెల 23న జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని 33 గదుల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్ తెలిపారు. గురువారం పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డాలతో కలసి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని పలు బ్లాకులను సందర్శిస్తూ ఓట్ల లెక్కింపునకు చేస్తున్న సాధారణ, బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మెయిన్ ఇంజనీరింగ్ బ్లాక్ లోని చోడవరం, మాడుగుల శాసన సభా నియోజక వర్గాల, ఇ.సి.ఇ.బ్లాక్ లోని అరుకు, పాడేరు శాసన సభ నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు గదులను పరిశీలించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పోలీస్ బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు ఏ విధంగా చేయాల్లో పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 33 గదుల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, వాటిలో 30 గదుల్లో ఇ.వి.ఎం.ల లెక్కింపు తరువాయి 2లో..

## కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదుల ఏరివేత చేపట్టారు. పుల్వామాలో గురువారం ఎన్‌కౌంటర్ జరిపి ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాసిబ్బంది మట్టుబెట్టారు. కాగా, ఎదురుకాల్పుల్లో ఓ జవాను అమరులయ్యారు. ఆర్మీ తెలిపిన వివరాల ప్రకారం..

పుల్వామాలోని దలిపొరా గ్రామంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో రాష్ట్రీయ రైఫిల్స్, సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ బలగాలు సంయుక్తంగా గ్రామంలో నిర్బంధ తనిఖీలు చేపట్టాయి. భద్రతా సిబ్బంది సోదాలు జరుపుతుండగా ఓ ఇంట్లో దాగి ఉన్న ముష్కరులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో ఎదురుకాల్పులు జరిపిన సిబ్బంది ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారు. మరికొందరు ముష్కరులు అక్కడి నుంచి పారిపోగా వారి కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఘటనాస్థలంలో భారీ ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. ఉగ్రవాదుల కాల్పుల్లో ఓ జవాను ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ఉండేందుకు పుల్వామాలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.



# పెద్దచెరువు శుద్ధిసేవతో జన్మజన్మల పుణ్యఫలం

## జిల్లా కలెక్టర్‌డా.ఎం.హరిజవహర్‌లాల్‌



విజయనగరం : పెద్దచెరువు శుద్ధిసేవలో పాల్గొన్న ప్రతీఒక్కరికీ జన్మజన్మల పుణ్యఫలం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. పెద్దచెరువు శుద్ధిసేవకు మేముసైతం అంటూ సాంఘీక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది గురువారం తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పెద్దచెరువులో ప్లాస్టిక్, ఇతర వ్యర్ధాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. పురపాలక సంఘం సమకూర్చిన గ్లౌజులు, మాస్కులు, కొంకులు, కత్తులు, చెత్తసేకరణ కవర్లు, డబ్బాలు పట్టుకొని చెరువు పరిశుభ్రతకు పూనుకున్నారు. చెరువు నుండి తొలగించిన వ్యర్ధాలను పురపాలక వాహనాల్లో తరలించారు.

కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ శుద్ధిసేవలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 నాటికి చెరువులో ప్లాస్టిక్, ఇతర వ్యర్ధాలను తొలగించే కార్యక్రమాన్ని పూర్తిచేస్తామన్నారు. జూన్ 1వ తేదీ నుండి పెద్దచెరువు పరిసర ప్రాంతాల సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తామన్నారు. ముందుగా ప్రజలు నడక, వ్యాయామం చేసేవిధంగా ప్రత్యేక వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దచెరువును శుద్ధిచేసి రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును సుందరంగా తయారు చేయడంతో పాటు, కాలుష్యరహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. వాతావరణం కలుషితం కారాదని, భావితరాలకు మంచి వాతావరణం అందివ్వాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి సునీల్‌రాజ్‌కుమార్, బిసి కార్పొరేషన్ ఇడి నాగరాణి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి జగన్నాథం, మున్సిపల్ ఇంజనీర్ మత్స్యరాజు, ఎంహెచ్ఓ డా.రత్నదీపక్, పురపాలక సంఘం పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహంలో వసతి పొందేందుకు దరఖాస్తులు స్వీకరణ

విజయనగరం: స్థానిక తాహసిల్దార్ ఆఫీర్ ప్రక్కన ఉన్న విభిన్న ప్రతిభావంతుల, బాలికల వసతి గృహంలో ఈ ఏడాది వసతి పొందేందుకు దరఖాస్తులు కోరుతున్నామని విభిన్న ప్రతిభావంతులు, మరియు వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు కె.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2019-20 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థినులుకు గాను 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 60 మంది కి సీటులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

శారీరక వైకల్యం, బధిరులకు ఉచిత భోజనం, వసతి కాస్మోటిక్ ఛార్జీలు, ఏడాదికి 4 జతల బట్టలు, నోట్ బుక్స్, వసతి గృహం దగ్గరలో పాఠశాల ప్రవేశం, కల్పిస్తామన్నారు. సదరం దృవపత్రం 40శాతం ఉండాలని, కుల,ఆదాయ, నివాస పత్రం తాహసిల్దార్ గుర్తింపునతో ఉండాలని, ఏ పాఠశాలలో చదువు తున్నారో వారి నుంచి బదిలీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జత చేసి కలక్టరేట్‌లో సదరు కార్యాలయయానికి పంపిచలని కోరారు.ఇతర వివరాలకు 08922-272021, లేదా 274647 నెంబర్లుకు సంప్రదించాలని తెలిపారు.

# జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతలు వీరే

విజయనగరం: గ్రంథాలయ ఉద్యమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన కొమర్రాజు లక్ష్మణరావు జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం పట్టణశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గురజాడస్మారక కేంద్ర గ్రంథాల యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానాన్ని వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బి.టెక్ ఫైనల్ విద్యార్థిని వేలూరి సాయి స్వాతిప్రియ సాధించగా, ద్వితీయ స్థానాన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బిబిఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని సి.హెచ్. సాయి సంతోషి శ్రావణ్య, తృతీయ స్థానాన్ని సాలూరుకు చెందిన ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని కె.దీక్షిత కైవసం చేసుకున్నారని, ఎం.శ్రీచరణ్, ఎస్ వి సాయిమేఘన,

వి.శ్రావణి కన్సొలేషన్ బహుమతులకు ఎంపికయ్యారని సంఘం పట్టణశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, ఉపాధ్యక్షురాలు ఎం సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

# కౌంటింగు కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు : జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

## 144 సిఆర్‌పిసి, సెక్షను 30 పోలీసు చట్టం అమలు : అనుమతులు లేని సమావేశాలు నిషేధం





విజయనగరంఎన్నికల కౌంటింగు తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో కౌంటింగు నిర్వహించే నాలుగు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ గురువారం నాడు తెలిపారు. ఎన్నికల కౌంటింగు చేపట్టే నాలుగు కేంద్రాలు వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, బందోబస్తు పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక్కొక్క పోలీసు అధికారిని ప్రత్యేకంగానియమిస్తున్నామన్నారు. కురుపాం, పార్వతీపురం, సాలూరు, ఎస్. కోట అసెంబ్లీనియోజక వర్గాల కౌంటింగు నిర్వహించే ఎం.వి.జి.ఆర్. ఇంజనీరింగు కళాశాల వద్ద పార్వతీపురం ఒఎస్‌డి జె. రామ్మోహన రావును, బొబ్బిలి, గజపతినగరం అసెంబ్లీ నియోజక వర్గాలకు కౌంటింగు నిర్వహించే జె.ఎన్.టి.యు. ఇంజనీరింగు కళాశాల వద్ద అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావును, చీపురుపల్లి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజక వర్గాల కౌంటింగు నిర్వమించే లెండిఇంజనీరింగు కళాశాల వద్ద మహిళా పిఎస్ డిఎస్పీ పెంటారావును, విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గ కౌంటింగు నిర్వహించే పోలీసు శిక్షణ కళాశాల వద్ద విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్‌లను పర్యవేక్షణాధికారులుగా నియమిస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే కౌంటింగు కేంద్రాలను పరిశీలించి, సెక్టర్లుగా బందోబస్తు నియమించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కౌంటింగు కేంద్రాలు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను రెగ్యులేట్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. అన్ని మండల కేంద్రాలలోను ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా పికెట్లును ఏర్పాటు చేస్తున్నామన్నారు. 144 సెక్షను, పోలీసు చట్టం సెక్షను 30 అమలులో ఉన్నందున ఎవ్వరూ గుంపులుగా సంచరించకూడదని, ముందస్తుగా పోలీసుశాఖ నుండి అనుమతులు లేకుండా సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలుకు విరుద్ధంగా ఎవ్వరైనా ప్రవర్తిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే బైండోవరు చేసిన 21,300 మందిలో సమస్యలు సృష్టించేందుకు అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు. బైండోవరు చేసినప్పటికి పోలింగు రోజున నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 16 కేసులు నమోదు చేసామని, మంచి ప్రవర్తనకు వారి నుండి బాండులు తీసుకొని,బైండోవరు చేసినప్పటికి నిబంధనలు ఉల్లం ఘించినందున వారు బాండు ఇచ్చిన మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కౌంటింగు కేంద్రాల్లోకి సెల్ ఫోనులు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లు, అనుమతించమన్నారు. పోలీసుశాఖచేపడుతున్న చర్యలకు ప్రజలంతా తమ సహాయ, సహకారాలను అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడే వ్యక్తులపై ఇప్పటికే నిఘా ఏర్పాటు చేసామని, నిబంధనల మేరకు బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నామని, కౌంటింగు పూర్తయినప్పటికీ వారు బెట్టింగులుకు పాల్పడినట్లు నిర్ధారణ అయినా, పోలీసుల దృష్టికి వచ్చినా వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేసారు. ఎన్నిక కౌంటింగు బందోబస్తు నిమిత్తం నాలుగు ఎన్నికల కేంద్రాల వద్ద సుమారు 3వేలు మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి జె. రామ్మోహన రావు, అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సి.ఎం. నాయుడు, ఎస్పీ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణ ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ కంటే కౌంటింగ్ భిన్నం




విజయనగరం: పోలింగ్ ప్రక్రియ కంటే కౌంటింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ అన్నారు. పారదర్శకంగా, ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు కౌంటింగ్ తీవ్రతను గుర్తించాలని కోరారు. గురువారం ఎఆర్‌ఓ, పర్యవేక్షకులు , కౌంటింగ్ అసిస్టెంట్లతో, మైక్రో అబ్జర్వరేజర్లతో సమావేశం నిర్వహించారు. అధికారులు, పరిశీలకులు ఇతర సిబ్బంది సమక్షంలో జరిగే కౌంటింగ్‌ను ఎన్నికల కమీషన్ కూడా పరిశీలిస్తుందని అన్నారు. ఏదో ఒక పార్టీకి అనుకూలంగా ఉండే దుస్తులు కూడా వేసుకోకూడదని తెలిపారు. కౌంటింగ్ ఏజంట్లు ఎంత పరిచయస్తులైనా వారితో అధిక సమయం సంభాషించరాదని దానివల్ల అనుమానాలకు అవకాశం ఇవ్వవద్దని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారే సర్వాధికారని మరొకసారి స్పష్టం చేశారు. గుర్తింపు కార్డులు లేకుండా అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు. మూడంచెల బధ్రతా తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 21వ తేదీన మాక్ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. సందేహాలుంటే 22వ తేదీన సంప్రదించాలన్నారు. ఇంచి పవర్ ప్రజంటేషన్‌ద్వారా పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకటరావు, స్ఫెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నాటకరంగస్థల నంది గ్రహీత శ్యామలరావు అకాలమృతి





విజయనగరం: అతని వేళ్ళు హార్మోనియంపై లేడిపిల్లలా కదలాడుతుంటే.. రాగయుక్తమైన పద్యానికి పరదాలు తొడిగినట్టు ఉంటాయి. అతని పద్యాలు గుండెగొంతు నుంచి వెలువడు తుంటే తాను ధరించే పాత్రలు సజీవ సాక్షాత్కారాలుగా నిలిచి ప్రేక్షకుల గుండెల్లో గూడుకట్టుకుంటాయి. నాదరదుడు పాత్రలో తాను నటిస్తుంటే అంత ఔదార్యం..ఔన్నత్యం పాత్రతో ఒదిగిపోయిన అంకితభావం ప్రేక్షకుల చప్పట్ల మధ్య పరవశించిపోతుంది. విజయనగర నాటక రంగస్థల కీర్తిని ఆపాదమస్తకం అభినయించి రాష్ట్రేతరాలకు చవిచూపిన ఆ నటుడు ఇక లేరని తెలిసి ఎందరో పౌరాణిక నటులు, నటీమణులు బారులుతీరి వారి కడసారి చూపుకోసం తరలివచ్చారు. అంతటి మహానటులు, కళాకారులు నెల్లూరి శ్యామలరావు. విజయనగరం నివాసి ప్రధమ నంది అవార్డు గ్రహీత. అమ్మాజమ్మ, వెంకటరావులకు 1945లో జన్మించారు. తాను నాటకరంగస్థలానికి కొత్తఊపిర్లు పోసేందుకు వచ్చినవాడని బాల్యంలోనే పలువురి ప్రశంసలు పొందారు. తన కుటుంబంలో కుమారుడు...హరిప్రసాద్, కూతుర్లు అరుణ, కరుణ ఏనాడూ తండ్రి ఆలనకోసం ఎదురుచూడలేదు. వారి కీర్తే లమ కీర్తిగా భావించారు. వారికికూడా అదే జిజ్ఞాస ఉండటంతో నిత్యం వారి ఇల్లు ఎందరో శిష్యులతో రాకపోకలతో బంధుగణంగా తలపించేది.ముందు సాంఘీకనాటకాలు పోసించినా... తనదైన బాణి.. శైలి ప్రస్ఫుటంగా కన్పించేది. ఇక తులాభారంలో శ్రీకృష్ణుడు, నారదుడు వేస్తే రంగస్థల ప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగేది. బిల్వమంగళ, భవానీ, అగ్నిజ్యోతనుడు ఇలా ఎన్నో పాత్రలకు పెట్టింది పేరు. అన్నింటికన్నా తాను పాటగాడేకాదు... మంచి హార్మోనిష్టుగా అనితరసాధ్యమైన ప్రదర్శనలు ఇచ్చారు. అందుకే ప్రభుత్వం బళ్ళారి రాఘవ అవార్డుతో 2014లో సత్కరించింది. ఎందరో శిష్యులను నాటకరంగానికి పరిచయం చేసిన శ్యామలరావు నేడు రంగస్థలాన్ని వీడి మరలిపోయారు. వారి మరణవార్త విన్న కళాకారులకు కంటనీరు మిగిల్చారు. వారి మృతికి ఎందరో అంజలిఘటించారు.

మొదటి పేజీ తరువాయి

# మహాగత్‌బంధన్

లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఈ ప్రయత్నంలో కూటమిలో అర్హతగలవారు ప్రధాని ఎవరైనా ఎలాంటి అభ్యంతరం లేదంటూ కాంగ్రెస్ సీనియర్ నేత గులామ్‌నబీ ఆజాద్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. 2017లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 40 స్థానాలకుగాను 17 స్థానాల్లో విజయం సాధించి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. 13 సీట్లు గెలుచుకున్న భాజపా ఇతర చిన్న పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఈ సారి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సోనియా ముందుకు కదులుతున్నారు. ఏ మాత్రం సమయం వృథా చేయకుండా ప్రతిపక్షాలన్నింటినీ సిద్ధం చేసేలా ముందుస్తు ప్రణాళికతో కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. తృణముల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ, మాయావతి (బీఎస్పీ), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ) ఈ సమావేశానికి హాజరవుతారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం మాయావతి, మమత బెనర్జీ ప్రధాని రేసులో ఉన్న నేపథ్యంలో గత్‌బంధన్ కూటమిలో వీరి పాత్ర కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

## కొత్త విషయాలు నేర్చుకుంటూనే, సమస్యలను అధిగమించాలి

ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అణువిభాగం కూడా గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్యం గురించి... అక్కడి వాతావరణం, భూమిలోని మినరల్స్ గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే వారిలో మరింత చైతన్యం వస్తుందని వెంకయ్యనాయుడు తెలిపారు.

# గుండాల్లా టీఎంసీ కార్యకర్తలు

మాట్లాడుతూ, కొద్ది నెలల క్రితం తాను వెస్ట్ మిద్నాపూర్ (పశ్చిమబెంగాల్)లో ర్యాలీ జరిపినప్పుడు టీఎంసీ గూండాలు స్వైరవిహారం చేశారని, ఆ తర్వాత ఠాకూర్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి ఎదురుకావడంతో తన ప్రసంగాన్ని కుదించుకుని బలవంతంగా స్టేజ్ దిగాల్సి వచ్చిందని చెప్పారు. 'ఇప్పుడు భాయ్ అమిత్‌షా కోల్‌కతా రోడ్‌షోలోనూ టీఎంసీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ విగ్రహాన్ని విధ్వంసం చేశారు. విద్యాసాగర్ సాగర కలల సాకారానికి మేము కట్టుబడి ఉన్నాం. తిరిగి అధికారంలోకి రాగానే ఎక్కడైతే విగ్రహాన్ని కూల్చేశారో అక్కడే భారీ విగ్రహం ఏర్పాటు చేసి తీరుతాం' అని మోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ పూర్వాంచల్ ప్రజలను బయట వ్యక్తులుగా మమతా దీదీ టార్గెట్ చేస్తున్నారని, బెహన్ మాయావతి అయినా ఈ చర్యను ఖండిస్తారని అనుకుంటే, ఆమె కూడా ఆ పని చేయడం లేదని ప్రధాని విమర్శించారు. అత్యాచారం కేసులో పరారైన వ్యక్తికి ఇక్కడ్నించి ఎస్పీ-బీఎస్పీ టిక్కెడ్ ఇచ్చిందంటూ ఆయన మండిపడ్డారు. యూపీలో సమాజ్‌వాద్ పార్టీ చరిత్ర అందరికీ తెలిసిందనేనని, అలాంటి వ్యక్తులకు ఓటేయమని బెహన్‌జీ ప్రజలను కోరుతున్నారని ఎద్దేవా చేసారు. 8 సీట్లతో కొందరు, 10 సీట్లు, 20-22 సీట్లు, 30-35 సీట్లతో ప్రధాని అయిపోదామని కొందరు కలలు కంటున్నారని, అయితే దేశ ప్రజలు మాత్రం మరోసారి మోదీ సర్కార్ కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

# ఆందోళనకరంగా ఈసీ తీరు

22 ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడిగా విజ్ఞప్తి చేసినా ఎన్నికల సంఘం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. నరేంద్రమోదీకి పదే పదే క్లీన్‌చిట్‌లు ఇవ్వడం, భాజపా చేసిన తప్పుడు ఫిర్యాదులపై కూడా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ప్రతిపక్షాల ఫిర్యాదుల్లో వాస్తవం ఉన్నప్పటికీ కావాలనే చర్యలు చేపట్టకపోవడం వంటివన్నీ కేంద్ర ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై అనుమానాలను స్పష్టంగా రేరెత్తిస్తోందన్నారు. ఎన్నికల సంఘం చిత్తశుద్ధినే సందేహాస్పదం చేస్తోందని, ప్రతిపక్షం చేసిన ఫిర్యాదులపై కూడా స్పందించి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను వినియోగించి ఎన్నికల సంఘం విశ్వసనీయతను నిరూపించుకోవాలన్నారు.

# ఓట్ల కౌంటింగ్ పటిష్టంగా జరగాలి

మిగిలిన 3 గదుల్లో 3 పార్లమెంట్ నియోజక వర్గాల్లోని పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ ఒక ఆర్.ఓ. టేబుల్‌తో పాటు మరో 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింప ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్ వద్ద ముగ్గురు సిబ్బంది ఉంటారని, వారిలో ఒకరు గజిటెడ్ అధికారి, మరొకరు కౌంటింగ్ అధికారి, మైక్రో అబ్జర్వరు ఉంటారన్నారన్నారు. అదే విధంగా ప్రతి అభ్యర్థిచే నామినేట్ చేయబడిన ఒక ఏజంట్ కూ ప్రతి టేబుల్ వద్ద ఉంటాడన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలవుతుందని, వాటి కౌంటింగ్ కొనసాగుతుండగానే ఇ.వి.ఎం.ల కౌంటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ అథెంటి కేషన్ కు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపుకు అత్యధిక సమయం పడుతుందని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్స్, ఇ.వి.ఎం.ల లెక్కింపు పూర్తయిన తదుపరి ప్రతి నియోజక వర్గం నుండి ఐదు వి.వి.ప్యాట్స్‌ని స్లిప్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఇందుకు కూడా ఎక్కువ సమయం పట్టొచ్చనే అభిప్రాయాన్ని కలెక్టర్ వ్యక్తంచేశారు. వి.వి.ప్యాట్స్ స్లిప్ల లెక్కింపునకు అదనపు భద్రతా ఏర్పాట్లును చేస్తున్నామన్నారు. పరిశీలకుల మినహా ఇంకా ఎరివరినీ సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్లతో ఓట్ల లెక్కింపు గదుల్లోకి అనుమతించడం లేదని, సెల్ ఫోన్లు డిపాజిట్ చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, పరిశీలకులు, ఆర్.ఓ.లు, ఏ.ఆర్.ఓ.ల వాహనాలను మాత్రమే లోపలకు అనుమతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు, ఏజంట్ల వాహనాలకు సంబందితి ఆర్ .ఓ.ల ద్వారా వాహనాల పాస్లను జారీ చేయడం జరుగుతుందని, వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్లో పాస్లు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజలను ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆయన తెలిపారు.

# మల్లన్నసాగర్‌ను ఆపే ప్రసక్తే లేదు

జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ నేతృత్వంలోని వేసవి సెలవుల ప్రత్యేక ధర్మాసనం స్పష్టంచేసింది. కాళేశ్వరం దాని అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి హైకోర్టులో 175కు పైగా పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ కలిపి విచారించాలంటూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం హైకోర్టులో మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసుకున్న విషయం తెలిసిందే.

శ్రీ కంచుమాంబ, కనకమహాలక్ష్మి కొత్తమహాలక్ష్మి అమ్మవార్ల

# పండగ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



మాధవధార: జూన్ 18వ తేదీ సాయంత్రం 05 గంటలకు కంచుమాంబ ఆలయం వద్ద పండగ కమిటీ చైర్మన్ సనపల బంగారు రాజు, ప్రెసిడెంట్ సనపల శ్రీకాంత్. శ్రీ మాధవ యువజన సమాజం కమిటీ ఆధ్వర్యంలో కంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగ జూన్ 18 (మంగళవారం) పండగ నిర్వహిస్తున్నట్లుగా కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సంఘం కమిటీ సభ్యులు మెట్ట గంగాధర్ రావు, కర్రి రాజేష్ బాబు, గొల్లపల్లి లక్ష్మణరావు, నంబళ్లా ఈశ్వర్ రావు, చిగురుపల్లి తేజేశ్వరరావు, అమ్మవారి సేవకులు సనపల పాండురంగారావు, మూల రాము తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా మైదానాల అభివృద్ధికి రూ. 30 లక్షలు మంజూరు

కొయ్యూరుః మండలంలో గల మూడు పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.30లక్షలు మంజూరు అయినట్లు ఎంపిడిఒ ఎస్‌కె.రెహమాన్ తెలిపారు. మండలంలో కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శరభన్నపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గల ఆట స్థలాలను క్రీడాకారులకు అనువుగా అన్ని హంగులతో అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఒక్కొక్క ఆట స్థలం అభివృద్ధికి రూ.10లక్షల చొప్పున మూడు పాఠశాలలకు రూ.30లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎస్-ఎస్ఎ నిధుల నుంచి 37 పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణానికి వీలుగా రూ.3.75కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. మరో 25 పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి వీలుగా నిధులు కేటాయించారన్నారు.

# ఉద్యోగాల పేరిట మోసంపై కేసు నమోదు

నర్సీపట్నంః ఉద్యోగాల పేరిట మోసం చేసిన పెదబడ్డేపల్లికి చెందిన ఉపాధ్యాయుడు గర్రెడ్డి సుందరరావు, మరికొందరిపై పసుపులేటి లక్ష్మి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు నర్సీపట్నం టౌన్ సిఐ లక్ష్మణరావు తెలిపారు. ఎయిడెడ్ స్కూళ్ల నోటిఫికేషన్ వచ్చిందని ఆర్‌సిఎం లేదా సిబిసిఎన్‌సి ఎయిడెడ్ స్కూళ్లలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద 2016 నవంబరులో రూ.9లక్షలు తీసుకొని ఉద్యోగం ఇవ్వకుండా మోసగించారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. తనలాగే పూడి శ్రీనివాసరావు వద్ద రూ.10లక్షలు, కశింకోట శ్రీనివాసరావు నుంచి రూ.10లక్షలు, కోలా అప్పలకొండ నుంచి రూ.12లక్షలు నిందితుడు తీసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తామంతా అడిగితే 2018 ఏప్రిల్‌లో డబ్బులు తిరిగి ఇస్తామని లిఖితపూర్వకంగా రాసిచ్చాడని, ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆ ఫిర్యాదులో వివరించినట్లు సిఐ తెలిపారు.

## క్రీడాకారునికి బెహరా ప్రోత్సాహం



మధురవాడ, మధురవాడ కు చెందిన టైక్వాండో, క్రీడాకారులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బెహరా భాస్కరరావ ఆర్థిక ప్రోత్సాహకాన్ని గురువారం అందజేశారు మధురవాడ కు చెందిన క్రీడాకారుడు బి మనోజ్ పట్నాయక్ జూన్ నెలలో హైదరాబాదులో జరగబోయే అంతర్జాతీయ టైక్వాండో పోటీల్లో పాల్గొనున్నారు, మనోజ్ కుమార్ ను ప్రోత్సహిస్తూ వైసిపి నేత బెహరా భాస్కరరావు కుమారుడు బెహరా విద్యాసంస్థల చైర్మన్ విజయ్ చైతన్య మనోజ్ కు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేశారు ఈ సందర్భంగా విజయ్ చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని హితవు పలికారు ఈ సందర్భంగా మనోజ్ కుమార్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు, కార్యక్రమంలో కే శ్రీనివాసరావు కంపర రాము చంద్రరావు కే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పై తగు జాగ్రత్తలు తీసుకోకపోతే చర్యలు తప్పవు

భీమునిపట్నం : భీమునిపట్నం జోనల్ ఏరియా లో గల వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలు నిర్వహించుతున్న షాపులు యందు కాలువలలో చెత్తను వేసిన కఠిన చర్యలు తప్పవనీ జోనల్ కమీషనర్ సి.హెచ్.గోవిందరావు తెలిపారు. షాపుల యందు ఉన్న కాలువలలో చెత్త,కవర్లు వేస్తున్నట్లు తెలిపారు. 50మైక్రాన్ల కంటే తక్కువ కవర్లు ఉపయోగించుట ప్రమాదమనీ,వాటిని నిషేధించడమైనదని చెప్పారు.

అలా 50మైక్రాన్ల కంటే తక్కువ కవర్లు వాడిన వారికి జరిమాన విధించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా షాపులకు జారీ చేసిన ట్రేడ్ లైసెన్సులు వారివారి షాపుల యందు ప్రదర్శించాలని తెలిపారు. ఎవరైన పారిశుద్ధ్యం పై తగు జాగ్రత్తలు తీసుకోని ఎడల తగు చర్యలు తీసుకుంటామనీ,ఇదియే కాకుండా జారీ చేసిన ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయబడుననీ జోనల్ కమిషనర్ తెలిపారు.

## ఉద్యానవ పంటల అభివృద్ధికి తోడ్పాటు

రోలుగుంటః ఉద్యానవన పంటల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని ఆ పంటల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఏపిఒ కె.సూర్యమణి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల స్థాయి వీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకం వర్తింపు, అమలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గౌతమ్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కామేశ్వరరావు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

## బాలికలకు పంపిణీకి సైకిళ్లు సిద్ధం

నాతవరంః ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు వచ్చే నెలలో ఉచితంగా సైకిళ్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బడికొస్తా పథకంలో భాగంగా నాతవరం మండలానికి 650 సైకిళ్లు కేటాయించారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా బాలికలకు ఇవ్వకుండా నాతవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భద్రపర్చారు. ప్రస్తుతం విడిభాగాలను మెకానిక్‌లు బిగిస్తున్నారు. మండలంలోని అన్ని హైస్కూల్‌లో 8,9 తరగతులు చదివే బాలికలకు వీటిని పంపిణీ చేయనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు శివరామప్రసాద్ తెలిపారు.

# ఓట్ల లెక్కింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

### సందేహాలుంటే అడిగి తెలుసుకోండి
### అవకతవకలకు అవకాశమీయరాదు
### ఓట్ల లెక్కిపును విజయవంతం చేయాలి
### జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన





విశాఖపట్నం: ఈ నెల 23న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పగడ్బందీగా నిర్వహించాల్సిందిగా జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక స్వర్ణభారతి ఆడిటోరియంలో ఆర్ ఒలు, ఎఆర్ ఒలు, సూపర్‌వైజర్లకు ఓట్ల లెక్కింపు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఒక్క అంశాన్ని అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎటువంటి సందేహాలున్నా వెంటనే తెలుసు కోవాలని, అదేవిధంగా ఎన్నికల నియమ నిబంధనకు సంబందించిన పుస్తకంలోని అంశాలను తెలుసుకోవాలన్నారు. సువిధ యాప్ నిర్వహణకు సంబంధించి పూర్తిస్తాయి అవగాహన కలిగించుకోవాలని , డేటాను మొదట ఎంట్రీ చేసిన తరువాతనే రౌండు వారీ ఫలితాలను ప్రకటించాలన్నారు. యాప్ లో ఎటువంటి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలన్నారు. లెక్కింపు కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లకు అనుమతించబడవన్నారు. అన్ని నియోజకవర్గ లెక్కింపు కేంద్రాలలో మీడియా కేంద్రాలను ఏర్పాటు చేసి రౌండువారీ ఫలితాలను సంబందిత ఇన్ చార్జి అందజేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లెక్కింపు ప్రక్రియలో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్స్ , తదుపరి ఈవియంలు, అనంతరం వివిప్యాట్ స్లిప్పల లెక్కింపు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్క అంశంలోను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని ఓట్ల లెక్కిపును విజయవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జెసి-2 యం వెంకటేశ్వరరావు, విశాఖపట్నం, అనకాపల్లి ఆర్డీఓలు తేజ్భరత్ , సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ డిజైన్లతో పార్కును ఆధునీకరించండి



విశాఖపట్నం :- వి.యం.ఆర్.డి.ఏ పార్కు(వుడా) ను స్మార్ట్‌డిజైన్లతో ఆధునీకరణపనులను చేపట్టాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. గురువారం వుడాపార్కు సందర్శించి ఇంజనీర్లు, చైతన్య కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు, పి.యం.జి హర్షలతో మాట్లాడారు. స్మార్ట్ పార్కుకు అణుగునమైన అత్యుత్తమ ల్యాండ్ స్కేప్‌తో తీర్చిదిద్దాలని అభిలషించారు. వారం రోజులలో ప్రస్తుత వుడా డిజైన్, ఆధునీకరించవలసిన డిజైన్లతో సమీక్ష నిర్వహించి ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. జోన్-2 మరియు జోన్ -3 గ్రేడింగ్ ప్లాన్, స్ప్లిట్ అప్ డిజైన్లు రూపొందించాలని కోరారు. పాత్‌వే (నడకదారి) చిల్డ్రన్స్ ప్లే ఏరియా, పార్కుకు నీటిసరఫరా తదితర అంశాలతో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రూ.30 కోట్లతో నభూతో నభవిష్యతి అనిపించేలా అత్యద్భుతంగా, స్మార్ట్‌గా రూపొందించాలని కోరారు.

కార్యక్రమంలో జివియంసి చీఫ్‌ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, యస్.ఇ వినయ్‌కుమార్, పి.యం.జి ప్రతినిధి హర్ష, అయికాం, చైతన్య కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు, ఇ.ఇ సుధాకర్, శ్రీనివాస్, స్మార్ట్ సిటీస్ మేనేజర్ ఏ.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎంసెట్ ఫలితాలు వాయిదా

అమరావతి: ఏపీ ఎంసెట్ ఫలితాలు విడుదల వాయిదా పడింది. ఈ నెల 18న విడుదల కావాల్సిన ఈ పరీక్ష ఫలితాలను వాయిదా వేస్తున్నట్టు ఉన్నత విద్యామండలి ప్రకటించింది. తెలంగాణలో ఫెయిలైన ఇంటర్ విద్యార్థుల రీవాల్యుయేషన్ ఫలితాల తర్వాతే ఎంసెట్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ ఫలితాల విడుదల తేదీని తర్వలో ప్రకటిస్తామని ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. హైదరాబాద్, ఏపీలో 115 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్, వ్యవసాయ, వైద్యవిద్యలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలకు 2,82,901 మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో ఇంజనీరింగ్‌కు 1,85,711 మంది, వ్యవసాయ, వైద్యవిద్య పరీక్షలకు 81,916 మంది విద్యార్థులు హాజరైన విషయం తెలిసిందే.

## వ్యవసాయ రుణాలపై పరిశోధనకు గీతం పిహెచ్‌డి



సాగర్‌నగర్ః ఉత్తరాంధ్రా జిల్లాలలో వ్యవసాయ రుణాలు, రైతుల ఆర్దిక పరిస్థితులపై జరిపిన పరిశోధనకు గాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పరిశోధకుడు బలిజి లోవకు పి.హెచ్.డి.అవార్డు లభించింది. చిన్న, సన్న కారు రైతులకు వ్యవసాయి రుణాలు ఏ విధంగా ఉపకరిస్తున్నాయి, రుణాల మంజూరు, చెల్లింపులు, రైతులకు బ్యాంకు రుణాలు ఏవిధంగా ఉపకరిస్తున్నాయి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తన అధ్యయనం జరిపినట్లు బలిజి లోవ తెలిపారు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం జిల్లాలలోని వంద మందికి పైగా రైతులపై జరిపిన ఈ అద్యయనంలో వ్యవసాయ రుణాలను మరింత సమర్ధంగా రైతులకు అందించడానికి సూచనలు చేసినట్లు డాక్టర్ బలిజిలోవ పేర్కొన్నారు. డాక్టర్ ఎస్.జి.రామారావు పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిపనట్లు తెలిపారు.

## వినికిడి సాధనాల సామర్థ్యం పెంపుపై గీతంలో పరిశోధన

### అరవింద కుమార్‌కు పిహెచ్‌డి అవార్డు



సాగర్‌నగర్: వినికిడి శక్తి కోల్పోయి చెవిలో వివిధ రకాల వినికిడి సాధనాలను ఉపయోగించే వారికి సమర్ధవంతమైన వినికిడి సాధనాలను డిజైన్ చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుడు చేసిన ప్రయత్నం పిహెచ్‌డి అవార్డుతో పాటు అందరి ప్రశంసలు అందుకుటోంది.ఇసిఇ విభాగానికి చెందిన ఎమ్.అరవింద్ కుమార్ చెవిలో వినికిడి సాధనాల పనితీరును గమనించి డిజిటల్ వినికిడి సాధనాలు తక్కువ బ్యాటరీ శక్తితో అనవసర ధ్వనులు లేకుండా ఎలా పనిచేయించవచ్చో తన పరిశోధన ద్వారా తెలియజెప్పారు. డాక్టర్ కె.మంజునాధా చారి పర్యవేక్షణలో తన పరిశోధనలు జరిపినట్లు డాక్టర్ ఎమ్.అరవింద్‌కుమార్ తెలిపారు.

## నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు

రావికమతంః మండలంలో కొత్తకోటలో ఎటువంటి అనుమతులు లేకుండా మోటార్లు బిగించుకొని నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. నీటి చౌర్యం కారణంగా వీధి కొళాయిలకు తాగునీరు సరిగ్గా రావడం లేదన్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఇటీవల పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, సిబ్బంది కలిసి పలు వార్డుల్లో పర్యటించి మోటార్లు బిగించుకొని తాగునీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి కొళాయి పైపులైన్‌కు బిగించిన మోటార్లను స్వాదీనం చేసుకున్నారు. ఎవరైనా నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## వేడుకగా వేంకటేశ్వర కల్యాణం

చోడవరం: చోడవరం, గోవాడ గ్రామాల్లో వెలసిన వేంకటేశ్వర ఆలయాల్లో వార్షిక కల్యాణోత్సవాలువేడుకగా నిర్వహించారు. గోవాడ చక్కెర కర్మాగారం ఆవరణలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరునికి సింహాచలం దేవస్థానం అర్చకుల పర్యవేక్షణలో కనుల పండువగా క్యలాణ మహోత్సవం నిర్వహించారు.

# ప్రజలకు సౌకర్యవంతంగా పార్కులకు మౌళిక సదుపాయాలు



విశాఖపట్నం :- అందరు ప్రజలకు సౌకర్యవంతంగా సరస్వతి, డైమండ్ పార్కులలో మౌళికసదుపాయాలు కల్పించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటనలో భాగంగా గురువారం సరస్వతిపార్కు, డైమండ్ పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేటట్లు పార్కులను తీర్చిదిద్దాలని కోరారు. మొక్కలు, లైటింగ్, వాకింగ్ ట్రాక్, ప్లే ఎక్విప్‌మెంట్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరస్వతి వాకర్స్ క్లబ్ సభ్యులు పార్కులను అభివృద్ధిచేస్తున్నందులకు అభినందనలు తెలిపారు.

కొంచెం లైటింగ్, త్రాగునీటిసరఫరా చేయాలని కమిషనర్‌ను కోరగా తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని హామినిచ్చారు. అనంతరం డైమండ్ పార్కును సందర్శించారు. వాకర్స్, ప్లేయిర్స్, ఓపెన్ జిమ్ వినియోగదారులు ఆనందంగా పార్కును ఉపయోగించుకొంటున్నందుకు అభినందించారు. ప్రజలు ఆనందం, ఆరోగ్యం, ఆహ్లాదానికి పార్కులను వినియోగించుకోవాలని హితవు పలికారు. దివ్యాంగులకు ర్యాంప్ ఏర్పాటు చేసి పార్కులను వినియోగించుకోనేలా ర్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సత్వరం పనులు పూర్తి చేసి పార్కులను పూర్తి స్దాయిలో అభివృద్ధి చేయాలని ఇ.ఇ మోహర్‌బాబా, ఏడిహెచ్ దామోదర్‌లకు సూచించారు.

అనంతరం నరశింహానగర్ రహదారి పనులను, పుట్‌పాత్‌ల ఏర్పాటును పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఇ.ఇ నరశింహారావు, ఏసిపి రామలింగేశ్వరరెడ్డి, ఏ.యం.ఓ.హెచ్ డా.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ లో ప్రతిభను చూపించిన విద్యార్థులు



ములగాడ: మల్కాపురం వెంకన్నపాలెం విజ్ఞాన్ టాలెంట్ స్కూల్లో పదోతరగతి పరీక్షా ఫలితాలలో ఆరుగురు విద్యార్థులకు పదికి పది శాతం మార్కులు సాధించి విద్యార్థులు మంచి ప్రతిభను చూపించారు ఇందులో భాగంగా మల్కాపురం గొల్ల వీధి చెందిన జర్నలిస్టు లోడగల గోవింద కుమార్తె లోడగల మౌనిక అనే విద్యార్థిని పరీక్ష ఫలితాల్లో పదికి పది శాతం సాధించింది మౌనికను స్కూల్ యాజమాన్యం అభినందించారు విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మా స్కూల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యను అందించడం వలన ఇప్పటివరకు వందకు వందశాతం మార్కులు సాధించారని ఇదే స్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు మంచి మంచి స్థాయిలో ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు పదికి పది శాతం సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు

**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఆర్‌టిసి/18-19/197**

1. ఎన్‌డి(వి) వద్ద ఎలక్ట్రికల్ విభాగము కొరకు 1700 కెడబ్ల్యు ఎసి మరియు డిసి మొబైల్ లోడు బ్యాంకు సరఫరా, ఇన్‌స్టాలేషన్, కమీషనింగు మరియు టెస్టింగు కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 5,17,000/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.
3. ప్రి-బిడ్డు సమావేశం: ఎమ్‌డిఎస్ విభాగము వద్ద **13 మే 19**/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.
4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 25 మే 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0049/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**

# విజయభాను సంపాదకీయం

## నైతిక సందిగ్ధత

సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియలో చివరి విడత పోలింగ్‌కు ప్రచారఘట్టం నేటితో ముగియనున్నది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి నిర్ణీత వ్యవధిలో ఎన్నికలను సజావుగా నిర్వహించుకోవడం గర్వపడవలసిన విషయమే. కానీ ప్రజలు అత్యుత్సాహంగా పాల్గొనే ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును విధానకర్తలు, ఎన్నికల కమిషన్ ఒకసారి సమీక్షించుకోవడం అవసరం. ఇంత సుదీర్ఘ ప్రక్రియ మూలంగా ప్రజలకు క్రమంగా ఆసక్తి సన్నగిల్లదా? గత నెల 11వ తేదీన తీర్పు నిచ్చిన ఓటర్లు ఫలితాల కోసం ఈ నెల 23వ తేదీ వరకు ఎదురుచూడాలా? ఏడు విడుతల పోలింగ్ గల యూపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఓటర్లది మరింత బాధ. కనీసం నెల రోజుల ముందునుంచి ప్రచార హోరును భరించాలె. బీహార్‌లో నలభై స్థానాలకు ఒక్కో విడతలో నాలుగు, ఐదు, ఎనిమిదేసి స్థానాల వంతున పోలింగ్ జరుపుతూ పోతే దాదాపు రెండు నెలలకు పైగా ప్రచార హోరుతో ప్రజలపై ఎంత ఒత్తిడి ఉంటుంది? దేశమంతా లోక్‌సభ ఎన్నికలతో పాటు కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ సుదీర్ఘ ప్రక్రియ మూలంగా ప్రజలకు ఫలితాల పట్ల ఉత్కంఠ, అనురక్తి నశించిపోతున్నది. ఎన్నికల విధానమే అపహాస్యమైపోతున్నది. దీనికితోడు ఎన్నికల నియమావళి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలు జరగని రాష్ట్రాల్లో కూడా ఏ విధాన నిర్ణయమూ తీసుకోలేని దుస్థితి. అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించడం వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో దేశ నాయకత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేని నైతిక సందిగ్ధతను ఎదుర్కొంటున్నది. ఆర్థికాభివృద్ధి క్షీణించిందని వార్తలు వస్తున్నా, పాలకులు పట్టించుకోలేకపోతున్నారు. రాజకీయపక్షాలు ఒకప్పుడు తమ విధానాలు ప్రజలకు వివరించడానికి ప్రాధాన్యం ఇచ్చేవి. కానీ ఇటీవలికాలంలో సూక్ష్మస్థాయిలో సామాజికవర్గాలను కూడగట్టడమనే కొత్త పోకడ మొదలైంది. భారీ ఎత్తున ధనాన్ని కుమ్మరించి ఆయా ప్రాంతాల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తున్నారు. ఇట్లా నాలుగైదు స్థానాల లెక్కన పోలింగ్ జరిగినప్పుడు అంగబలం, అర్థబలం ఉన్న రాజకీయపక్షానిది పైచేయిగా ఉంటుంది. రాజకీయపక్షాల ప్రచారం ఒకప్పటి మాదిరిగా సంస్కారవంతంగా ఉండటం లేదు. ఇంత పెద్ద దేశంలో వివిధ స్థాయిల్లో పాలనావ్యవస్థను ఇంత సుదీర్ఘకాలం స్తంభింపజేయడం సబబు కాదు. రాజకీయపక్షాలు ఒకప్పుడు తమ విధానాలు ప్రజలకు వివరించడానికి ప్రాధాన్యం ఇచ్చేవి. కానీ ఇటీవలి కాలంలో సూక్ష్మస్థాయిలో సామాజికవర్గాలను కూడగట్టడమనే కొత్త పోకడ మొదలైంది. భారీ ఎత్తున ధనాన్ని కుమ్మరించి ఆయా ప్రాంతాల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తున్నారు. ఇట్లా నాలుగైదు స్థానాల లెక్కన పోలిం గ్ జరిగినప్పుడు అంగబలం, అర్థబలం ఉన్న రాజకీయపక్షానిది పైచేయిగా ఉంటుంది. రాజకీయపక్షాల ప్రచారం ఒకప్పటి మాదిరిగా సం స్కారవంతంగా ఉండటం లేదు. రాజకీయ సం స్కృతిలో వచ్చిన మార్పు ఇందుకు కొంత కారణమైతే, ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా ఉండటం మరో కారణం. తమ విధానాలను ప్రజలకు చెప్పడం, కార్యకర్తలను ఉత్సాహపరుచడం ఎంతకాలమని సాగించాలె? అందుకే యూపీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో బీజేపీ, ప్రతిపక్ష నేతలకు మధ్య వేడి రగులుతూ దిగజారిపోయి తిట్టుకునే పరిస్థితి ఏర్పడ్డది. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఇద్దరూ గూండాలే అనేది పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ చేసిన తాజా విమర్శ! కార్యకర్తల మధ్య గొడవలతో ఊళ్ళు రణరంగాలను తలపిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల వల్ల పశ్చిమ బెంగాల్‌లో ప్రచా ర కార్యక్రమాన్ని ఒకరోజు తగ్గించవలసి వచ్చింది. కనీసం ఉన్నత స్థానాలలో ఉన్నవారు కూడా నిబ్బరం పాటించడం లేదు. దేశ ప్రధాని, అధికార పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానా ల్లో ఉన్నవారు కూడా సంయమనం పాటించకపోతే ఇక కార్యకర్తలను తప్పు పట్టేదేమున్నది! ఒకప్పుడు రాజకీయ ప్రచారం ఎంత హుందాగా సాగేది! ప్రతిపక్షాల నుంచి అత్యంత ఎక్కువ విమర్శలు ఎదుర్కొన్న ప్రధాని ఇందిరాగాంధీ. ప్రతిపక్షాలు ఎంత విమర్శించినా హద్దు దాటకపోయేవి. ఇందిరాగాంధీ ఏనాడూ ఏ ప్రతిపక్ష నేతను పేరు పెట్టి విమర్శించలేదు. ఇప్పుడు కుటుంబ సభ్యులను కూడా బజారుకీడుస్తున్నారు. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఎంతవరకు ఈ దిగజారుడు సంస్కృతిని కాపాడ గలుగుతాయి? రాజకీయ పక్షాల నుంచే మార్పు ప్రారంభం కావాలె. ఇందుకు బాధ్యతా యుత స్థానాల్లో ఉన్నవారిదే బాధ్యత. ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గించడం కూడా ప్రధానాంశమే. ఈ సారి రాజకీయపక్షాలకు పారిశ్రామిక సంస్థలు నిధులు ఇచ్చే విషయం చర్చకు వచ్చింది. మోదీ ప్రభుత్వం అనేక చట్టాలను మార్చి ఎన్నికల నిధులు ఇవ్వడంలో పారదర్శకత లేకుండా చేస్తోంది.

# ఫిర్యాదుల స్వీకరణకు 6309898989 పోలీసు వాట్సాప్

విజయనగరం : జిల్లాలో ఎక్కడైనా, ఏదైనా నేరం జరిగినపుడు, పోలీసులకు వెంటనే సమాచారంను అందించేందుకు, ఏదైనా ప్రజా సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని భావించినపుడు వాట్సాప్ నంబరు 6309898989కు మెసేజ్‌ను పంపాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రజలను కోరారు. ఇందుకు సంబం ధించిన వాట్సాప్ నం.6309898989నుజిల్లా ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో తే. 16-05-2019 ది, గురువారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మాట్లా డుతూ - పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చెయ్యాలనే సంకల్పంతోను, ప్రజల నుండి ఫిర్యాదులను పోలీసుశాఖ సులువుగా స్వీకరించేందుకు వాట్సాప్ నంబరును ప్రారంభించా మన్నారు. ఈ వాట్సాప్ నంబరుకు ప్రజలు ఎవరైనా పోలీసుల దృష్టికి తీసుకు రావాలి అనుకుంటున్న సమస్య లను, ట్రాఫిక్ సమస్యలు, ఈవ్ టీజింగు, మహిళా సమస్యలు, రోడ్డు ప్రమాదాలు, కోడి పందాలు, గొర్రి పందాలు, జూదాలు, బహిరంగ మద్యం, మద్యం సేవించి వాహనాలు నడిపేవారి సమా చారం, ప్రజలకు అసౌకర్యం కల్పించే న్యూసెన్సు పనులు గురించి, అనుమానితు వ్యక్తుల గురించిన సమాచారంను, శాంతి భద్రతల సమస్యలను, వ్యభిచారం, క్రికెట్, రాజకీయ బెట్టింగులు గురించిన సమాచారం, మహిళల వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు, పోలీసులు చేసే మంచి పనులు, ర్యాగింగు సంబంధించిన ఫిర్యాదులతో పాటు, మంచి పోలీసింగుకు సలహాలను కూడా ఇవ్వవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. వాట్సాప్ నంబరుకు పంపే సమాచారం క్లుప్తంగా, అర్థం అయ్యే విధంగా ఉండాలని, ఫిర్యాదుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తక్కువ నిడివితో ఏమైనా జతపర్చి పంపాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఫ్రెండ్లీపోలీసింగులో భాగంగా జిల్లా పోలీసులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ విన్నూత్న కార్యక్రమాన్ని ప్రారంభించా మన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం, అవసరమైతే వారితో మాట్లాడి, మరిన్ని వివరాలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారికి చర్యలు తీసుకొనేందుకుగాను వాట్సాప్ సందేశాన్ని పంపుతామని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు తీసుకున్న చర్యలను ఫిర్యాదిదారునికి మళ్ళీ వాట్సాప్ సందేశం ద్వారా తెలియపరుస్తామన్నారు. ఈ వాట్సాప్ నంబరుకు వచ్చే ఫిర్యాదులను, తీసుకున్న చర్యలను ఒక రిజిష్టరులో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా నియమిం చబడిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన ఆదే శాలు ఇచ్చామన్నారు. ఈ వాట్సాప్ నంబరు పోలీసు కంట్రోల్‌రూంలో ఉంటుందని, దీనిని 24 గం॥లు పర్య వేక్షించే విధంగా డయల్ - 100పోలీసు సిబ్బంది పని చేస్తారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు.

# మోదీని ఢీకొట్టేందుకే ఇలా..: యోగి



వారణాసి: బలహీన వర్గాల ప్రజల గురించి పోరాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీకి మళ్లీ అధికారం దక్కకుండా చేసేందుకే ప్రతిపక్షాలు పనిచేస్తున్నాయని యూపీ ముఖ్యమంత్రి, భాజపా నాయకుడు యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. గురువారం వారణాసిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా పాలన కొనసాగించి, దేశాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లారని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రజలకు మోదీ చాలా మేలు చేశారని అన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్షాలన్నీ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. గత ఐదేళ్లలో 24 లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారని, 2.6 కోట్ల మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చారని అన్నారు. ఇన్ని పనులు గతంలో ఏ ప్రధానీ చేయలేదని చెప్పారు. ఆయన చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ ఆయనకు ఓటు వేసి అత్యంత ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని అక్కడి ప్రజలను కోరారు. మోదీ పోటీ చేస్తున్న వారణాసిలో కాంగ్రెస్ అభ్యర్థిగా అజయ్ రాయ్ బరిలో దిగారు.

ఆఖరి విడతలో మే 19న ఈ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. కాగా మే 23న దేశవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు జరగనుంది.

# హీరోలా గర్భిణిని రక్షించిన ఆటో డ్రైవర్..



దిస్పూర్: అసోంలో ఓ ఆటో డ్రైవర్ చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. మతసామరస్యాన్ని చాటి ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అన్ని విషయాల కన్నా మానవత్వమే మిన్న అన్నే సందేశాన్ని ఇచ్చాడు. మత ఘర్షణల కారణంగా అసోంలోని హైలాకండీలో కర్ఫ్యూ విధించారు. దీంతో ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఓ హిందూ మహిళ పురిటి నొప్పులతో అల్లాడిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఓ ముస్లిం యువకుడు.. కర్ఫ్యూను కూడా లెక్క చేయకుండా తన ఆటోలో ఆమెను ఆస్పత్రికి తరలించి, తల్లీ,బిడ్డ ప్రాణాలు కాపాడి అందరితో శభాష్ అనిపించుకున్నాడు.

మరిన్ని వివరాల్లోకి వెళ్తే, రుబెన్ దాస్ అనే వ్యక్తి తన భార్య నందిత పురిటి నొప్పులతో బాధపడుతుండడం చూసి అంబులెన్స్ కోసం ప్రయత్నించాడు. అయినప్పటికీ, తమకు సాయం అందకపోవడంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఆయన బాధపడిపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆటో డ్రైవర్ మక్బూల్.. వెంటనే తన ఆటోలో నందితను సరైన సమయానికి ఆస్పత్రికి చేర్చాడు. వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. చుట్టూ ఉన్న వారు మతాల కోసం ఘర్షణ పడుతుంటే ఆ ఆటోడ్రైవర్ మాత్రం హిందూ మహిళను సాయం చేసి హీరో అయ్యాడు.

ఆ ప్రాంత డిప్యూటీ కమిషనర్ కీర్తి జల్లీ నందిత వద్దకు వచ్చి ఆమె పరిస్థితి తెలుసుకున్నారు. హిందూ-ముస్లిం సామరస్యాన్ని చాటే ఇటువంటి ఉదాహరణలు మరిన్ని వెలుగులోకి రావాలి అని అన్నారు. కర్ఫ్యూ ఉన్న సమయంలోనూ సాహసోపేతంగా ఆమెను ఆస్పత్రికి చేర్చిన ఆటోడ్రైవర్‌ను ప్రత్యేకంగా కలిసి ప్రశంసించారు. కాగా, ఘర్షణల కారణంగా ఇటీవల ఆ ప్రాంతంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.. మరో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. పలు వాహనాలు, దుకాణాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కర్ఫ్యూ విధించి, అంతర్జాల సేవలను కూడా బంద్ చేశారు.

## కవి సమయం

### 'మాయదారి మగోడు'

చూసేది - చూస్తావు
చేసేది - చేస్తావు
ఏం ఎరగనట్లు ఉంటావు
నోట్లో ఏనిపెడ్తే కొరకనట్లు ఉంటావు
ఇదేం చిత్రమో! ... ఇదేం విచిత్రమో!
...॥చూ॥

ఉప్పుడు చేప వేపిపెడ్తే
చప్ప-చప్ప గుందంటావు
పులుసు చేప పేడ్తే
చేదు-చేదుగుందంటావు
తినేసేది -తినేస్తావు
అలాగుంది - ఇలా గుంది అంటావు
వంక లేడ్తుంటావు
ఇదేం చిత్రమో... ఇదేం విచిత్రమో!
...॥చూ॥

రాత్రేమో!... వెసనాలకు దూరం
గుంటానని వాగ్ధానం చేస్తావు
పగలంతా నోరు కంపు చేసుకొస్తావు

త్రాగేసేది - త్రాగేసి
ఏం (ఎరగనట్లు ఉంటావు) తాగ లేదంటావు
సిగిరెట్ కొండిలాఔతావు
ఇదేం చిత్రమో!... ఇదేం విచిత్రమో!
...॥చూ॥

ఇంట్లో ఉన్నంతవరకు
బాగానే వుంటావు
బైటకెళ్లి వస్తే చిర్రు-బుర్రు ఔతావు
అల్లది చూస్తే అలా ఉంది
ఇల్లది చూస్తే ఇలా ఉంది
నువ్వేమిటి ఎలానూ లేవు అంటావు
ఇంట్లో రామయ్యా.. వీధిలో కృష్ణయ్యగ మారుతావు
ఇదేం చిత్రమో!... ఇదేం విచిత్రమో!
...॥చూ॥

... కవితా రచన
యల్.సిద్ధూ

# పంచాంగం

మాసం : వైశాఖ తిథి : చతుర్ధశి తె.3.57;
స్వాతి తె.3.09; ఉ.వ.9.23ల 10.55.

**మేషం** :ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రము ఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు. **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.. **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు. **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూల మవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తుల నువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి. **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్య

# నర్మదా, సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్



## సంకీర్తన

మధ్య ప్రదేశ్ రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తున్న పవిత్ర జీవ నది నర్మదా. నర్మదాతో పాటుగా సోన్ నదుల జన్మస్థలం అమర్‌కంటక్. ఉత్తర భారతాన్ని దక్షిణాది విడగొడుతున్న పర్వత సానువైన వింధ్యలోని ప్రాంతం అమర్‌కంటక్. హిందువులు పవిత్ర క్షేత్రంగా పేర్కొనే దానిలో అమర్‌కంటక్ ఒకటి. అన్ని నదులు కంటే భిన్నంగా తూర్పు నుంచి పడమరకు ప్రవహించే అతిపెద్ద నదుల్లో ఒకటి నర్మదా. ఇక్కడే ఉద్భవించిన సోన్ నది మాత్రం తూర్పు ముఖంగా ప్రవహిస్తుంది. అడవుల మధ్య ఉన్న ప్రాంతం కావడంతో పచ్చదనంతో కళకళలాడుతుంది అమర్‌కంటక్. మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల మీదగా 1,312 కి.మీ. మేర ప్రవహించి అరేబియా సముద్రంలో సంగమిస్తుంది. నర్మదా సంగమ ప్రాంతం గుజరాత్‌లోని భారూచ్‌కు 50 కి.మీ. దూరంలో ఉంది. మనదేశంలో ఐదో అతిపెద్ద నది నర్మదా. దేశంలోని అన్ని నదులు తూర్పు వైపుకు ప్రవహిస్తుంటే నర్మదా, తపతి, మాహిలు మాత్రం పడమర దిశగా ముందుకు సాగుతాయి. నర్మదా నది వల్ల ఎక్కువ లబ్ధి పొందేది మధ్య ప్రదేశ్. నర్మదకు 41 ఉపనదులు ఉన్నాయి. సాత్పూరా పర్వత శ్రేణిలో జన్మించినవి 22 నదులు కాగా, మిగిలిన 19 నదులు వింధ్య లోవి. భారతదేశం లోని పవిత్ర పంచ జీవ నదుల్లో నర్మద ఒకటి. మిగిలినవి గంగా, యమునా, గోదావరి, కావేరి. విష్ణు పాదోద్భవి అయిన పవిత్ర గంగానదిలో ప్రతి ఏడాది కోట్లాది జీవరాశులు స్నానం చేయటంవల్ల అపరిశుభ్రం అవుతుంది. గంగా మాత తిరిగి పవిత్రంగా మారాలంటే నర్మదలో స్నానం చేయమని పరమ శివుడు ఆమెను ఆదేశించాడు. నర్మదా నది పవిత్రత, ప్రాముఖ్యత గురించి రామాయణం, మహాభారతాలతో పాటుగా వాయు, స్కంధ పురాణాల్లో వివరించారు.

### ప్రముఖ పుణ్యక్షేత్రాలు

### అమర్‌కంటక్

నర్మదా నది జన్మించిన ప్రాంతం అమర్‌కంటక్. వింధ్యా-సాత్పూరా పర్వత శ్రేణులను కలిపే మైకాల్ పర్వతాల్లోని ప్రాంతం అమర్‌కంటక్. ఈ ప్రాంతం సముద్రమట్టానికి 1067 మీటర్లు ఎత్తున ఉంది. ఇక్కడ ఉన్నటువంటి నర్మదా నది దేవాలయాన్ని నాగపూర్ భోన్సలే రాజులు నిర్మించారు. బాఘేల్, కల్చూరీ వంశ రాజులు అమర్‌కంటక్‌లో అనేక దేవాలయాలు నిర్మించారు.

### ఓంకారేశ్వర్

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటి ఓంకారేశ్వర్. ఇక్కడ వెలసిన శివుడు పేరు ఓంకారేశ్వరుడు.

### మహేశ్వర్

దక్షిణ అవంతి రాజ్య పరిధిలోని ప్రాంతం మహిషసతి. మహాభారతం, రామాయణంలలో దీని గురించి ప్రస్తావన ఉంది. ఇక్కడి దేవుడి పేరు మహేశ్వరుడు. మహిషసతిని ప్రస్తుతం మహేశ్వర్‌గా పిలుస్తున్నారు.

### ఎలా చేరుకోవాలి ?

**విమాన మార్గం** : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ.) సమీపంలోని విమానాశ్రయాలు.

**రైలు మార్గం** : పెండ్రా రోడ్ సమీపంలోని రైల్వే స్టేషన్. అమర్‌కంటక్ నుంచి 42 కి.మీ. దూరంలో ఉంది పెండ్రా రోడ్. కత్ని-బిలాస్‌పూర్ మార్గంలో ఉంది పెండ్రా రైల్వే స్టేషన్.

**రహదారి మార్గం** : జబల్‌పూర్ (228 కి.మీ.), రాయ్‌పూర్ (230 కి.మీ).

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## హైవే క్రాస్ రోడ్డు వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయరూ!

తగరపువలస : తగరపువలస రోడ్డు నుండి హైవే క్రాస్ చేసినప్పుడు, బోయపాలెం క్రాస్ చేసినప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుందని సిగ్నల్ పెడితే ప్రమాదాలు జరగవనీ మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పూసర్ల రామారావు పోలీసు వారికి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు వైపులా నుండి వచ్చిన వాహనాలు సిగ్నల్ లేకపోవడంతో చాలా స్పీడ్ గా వెళ్తున్నాయనీ తెలిపారు.ఆ ప్రాంతాల్లో ఒక్క సిగ్నల్ ఉంటే చాలా సేఫ్టీ గా ఉంటుందనీ అన్నారు. దీనివలన ప్రమాదాలు నివారించవచ్చనీ ప్రమాదాలు జరగకుండా చూసేందుకు రోడ్డు సేఫ్టీ వాహనాలు ఉన్న, వాళ్ళు కేసులు, డ్రింకు కేసులు నమోదు వాటితో బిజీ బిజీగా ఉన్నారనీ చెప్పారు.కావున రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చుట్టుపక్కల ప్రజానీకం తరపున కోరుచున్నామనీ ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

పెద్దాపురం : మే'16' జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పెద్దాపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నివాస ప్రాంతాలలో, చుట్టుప్రక్కల నీటి నిల్వలు అధికంగా వుండడంతో, దోమలు చేరి కుట్టడం వలన ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకి అనారోగ్యంతో బాధపడుతున్నారని, వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఎన్.సుదీప్తి తెలిపారు. నివాస ప్రాంతాల పరిశుభ్రత, తాగునీటి జాగ్రత్తలు ప్రతివారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు, పారిశుధ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



అరసవల్లి : బీఎస్ఎన్ఎల్ సంస్థలో గత 20 ఏళ్లుగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులందరికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఈ నెల 1 నుంచి తొలగించారని, వారందరిని విధుల్లోకి తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టు అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు కోరారు. శ్రీకాకుళం నగరంలోని సంచార్ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు కార్యక్రమాలను రూపొం దించడానికి హైదరాబాద్‌లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బీఎస్ ఎన్ఎల్ ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులతో ఈ నెల 19న సమావేశం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.కొండలరావు, ఈయూ జిల్లా కార్యదర్శి పి.వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు

పెద్దాపురం : స్థానిక ఎక్సైజ్ పరిధిలో దాడులు జరిపి సారా విక్రయాలకు పాల్పడుతున్న 5గురిని అరెస్టు చేసినట్లు సిఐ నాగభూషణ తెలిపారు. వడిశవేరుకు చెందిన బత్తిన వెంకన్న, కోట పెంటయ్య, గుడాల అప్పారావు, ఉందూరి రాంబాబు, కేశిబోయిన మంగలను అదుపులోకి తీసుకున్నారు. ముకుందవరానికి చెందిన షేక్ లాల్‌జాన పరారీలోఉన్నాడు. పట్టుబడిన వారి నుండి 50 లీటర్ల సారా, 1800 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఎన్.కృష్ణ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లంబా



సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామివారిని ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లంబా ఏవీఎస్ఎం, పివీఎస్ఎం కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న ఆయనకి సింహాచలం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఇతర అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మి అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ ఈఓ వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.



### డెంగీపై వైద్యశాఖ అప్రమత్తం

శికాకుళం : డెంగీ వ్యాధిపై ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని.. ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.చెంచయ్య పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా శ్రీకాకుళంలో నగరంలో డీఎం హెచ్‌వో కార్యాలయంలోని తన ఛాంబరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### హ్యాపీ అవర్స్ ఆఫర్‌ను అందిస్తున్న గేమ్స్ క్రాఫ్ట్

విశాఖపట్నం : భారతదేశంలో ఎంతో అభిమానింపబడుతూ వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీ గేమ్స్ క్రాఫ్ట్ రమ్మీ ఆటను ఇష్టపడే తన అభిమానులను పెద్ద ఎత్తున ఆకట్టుకునేందుకు ఎంతో ఆకర్షణీయమైన హ్యాపీ అవర్స్ ఆఫర్ అందుబాటులోకి తీసుకువచ్చిందని ఫౌండర్ సీటిఒ పృథ్వీసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాపీ అవర్స్ ఆఫర్‌లో భాగంగా గత 30 రోజుల్లో సుమారు 10వేల మంది వినియోగదారులు దాదాపు 50 లక్షల రూపాయలు మొత్తం బోనస్ ఆఫర్‌ను అందుకోవడంలో ఇదిక గొప్ప విజయాన్ని సాధించిందన్నారు.

## పంచాయతీల విలీనంపై అభిప్రాయాల సేకరణ



భీమునిపట్నం : భీమునిపట్నం మండలంలో గల 5 పంచాయతీ లైన కాపులుప్పాడ,కె. నగర పాలెం, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం, నిడిగట్టు గ్రామాలను జీవీఎంసీ లో విలీనం చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అయితే అప్పట్లో జివిఎంసి లో విలీనం చేయడానికి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కాపులుప్పాడ, కె.నగరప్పాలెం పంచాయతీల ప్రజలు తరపున అక్కడ ప్రజా ప్రతినిధులు విలీనం చేయడానికి వీలు లేదని కోర్టును కూడా ఆశ్రయించారు. ఇది ఇలా ఉండగా గురువారం జిల్లా పంచాయతీ అధికారి వారి ఆదేశాల మేరకు ఎంపీడీఓ లవరాజు ఆధ్వర్యంలో ఈ ఐదు పంచాయతీలు జీవీఎంసీ లో విలీనం చేయడంపై ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశాలు నిర్వహించారు. కాపులుప్పాడ పంచాయతీ సమావేశంలో 174 మంది హాజరుకాగా అందులో 100 శాతం విలీనానికి వ్యతిరేకంగా తమ సంత కాలు చేశారు. దీంతో ఈ పంచాయతీ విలీనానికి వ్యతిరేకమని తీర్మానం చేశారు. అదేవిదంగా కె.నగరప్పాలెం పంచాయతీలో 9 మంది విలీనానికి మద్దతు తెలుపగా 94 మంది విలీనం వద్దనీ, పంచాయతీలే ముద్దు అంటూ ప్లే కార్డ్ లతో సహితం తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. దీంతో ఈ పంచాయతీ కూడా విలీనానికి వ్యతిరేక మని తీర్మానం చేశారు. అయితే ఈ రెండు పంచాయతీలలో మహిళలు ఎక్కువగా హాజరయ్యారు వీరు తమ అభిప్రాయాలను స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంతవరకు తమకు ఏ విధమైన సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కారానికి వీలుంటుందని ఏ చిన్న అవసరం వచ్చిన ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మేము తిరగలేమని అంతేకాకుండా మాకు పన్నుల భారం కూడా అధికంగా ఉంటుందని తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఇందుకు భిన్నంగా చేపలుప్పాడ పంచాయతీ నిలిచింది. ఈ పంచాయతీలో 81 మంది తమ పంచాయతీని జీవీఎంసీ లో విలీనం చేయమని 11 మంది చేయొద్దని తమ అభిప్రాయం వ్యక్త పరిచారు. ఇక్కడ ప్రజాభిప్రాయానికి వస్తే జీవీఎంసీలో తమ పంచాయతీ విలీనం చేస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందని తమకు త్రాగు నీటి సమస్య తీరుతుందని అంతే కాకుండా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, ఉద్యోగావకాశాలు పెరగాలన్న, నిధులు పెరగాలన్న జీవీఎంసీ లో విలీనం చేస్తేనే సాధ్యంమవుతుందని అన్నారు. మొత్తానికి పంచాయతీల విలీనంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ కార్యక్రమంలో కాపులుప్పాడ, కె.నగర పాలెం చేపలుప్పాడకు చెందిన ప్రముఖులు గరికిన కింగ్, మరుపల్లి అమరనాథ్,నాగోతు సింగన్న, దొలపిల్లి ఏడుకొండలు, ఎం. చిన్న, మైలపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన

### జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా



పెద్దాపురం : గురుకుల పాఠశాల నిర్మాణానికి పెద్దాపురం ఏలేరు ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాన్ని గురువారం కలెక్టర్ కార్తీకేయ మిశ్రా రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్‌తో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్‌కు చెందిన ఈ స్థలం 13 ఎకరాల 96 సెంట్లు, ఇరిగేషన్ కార్యాలయానికి 46 సెంట్లు, ఎంపీడీవో కార్యాలయానికి 44 సెంట్లు, డియస్‌పి కార్యాలయానికి 40 సెంట్లు ఉపయోగించగా, మిగిలిన 12 ఎకరాల 66 సెంట్ల స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని, గురు కుల పాఠశాల నిర్మాణానికి కేటాయించడానికి జిల్లా కలెక్టర్, కార్తికేయమిశ్రా, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్‌తో కలిసి స్థలం యొక్క సర్వే మ్యాప్‌ను, స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దా పురం తహశీల్దార్ కె.గోపాల కృష్ణ, జగ్గంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భారతలక్ష్మి, ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి.ఆర్.శేషాద్రి, కె.వి.లక్ష్మి నారాయణమ్మ, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## మూడువేల మందికి మజ్జిగ పంపిణీ



మధురవాడ : గ్రేటర్ విశాఖ ఐదవ వార్డ్ పరిధి మధురవాడ స్వతంత్ర నగర్ లో ఎండల తీవ్రతతో గురువారం శిరిడి సాయి బాబా ఆలయం వద్ద స్వతంత్ర నగర్ యూత్ మరియు గ్రామ పెద్దల సహకారంతో మూడువేల మందికి మజ్జిగ ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయం త్రం 5 గంటల వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉగ్గిన నాగరాజు, కరకాని ఈశ్వరరావు, జిలకర్ర గణేష్, రమేష్ నాయుడు, హరికృష్ణ, శివ కుమార్, రింగ్ రాజు, ప్రశాంత్. భరత్, విజ్జు. ఆలయ ప్రధానార్చకులు అధికారుల కాళిదాసు పాల్గొన్నారు.

## త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రాలు దాఖలు చేయాలి : ఎస్పీ దామోదర్

విజయనగరం: న్యాయం కోసం పోలీసు స్టేషనులను ఆశ్రయించే బాధితుల పట్ల సానుకూలంగా స్పందించాలని, వారు చెప్పే విషయాలను ప్రత్యేక శ్రద్ధతో విని, న్యాయం చెయ్యాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ -అనవసరంగా బాధితులుపోలీసు స్టేషను ప్రాంగణాల్లో వేచి ఉండకుండా, వారికి సత్వర న్యాయం అందించాలన్నారు. పట్టదగిన నేరాలుపై ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చెయ్యాలన్నారు. పోలీసు స్టేషనుల భద్రత విషయంలో రాజీ పడ వద్దని, పోలీసు స్టేషను రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి, పోలీసుల విలువైనసమయాన్ని దుర్వినియోగపర్చే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా బైండోవరు చేసినప్పటికి, నిబంధనలను ఉల్లంఘించి, అల్లర్లు సృష్టించిన వారి నుండి బాండుగా ఇచ్చిన మొత్తాన్ని వసూలు చెయ్యాలని, వారు కట్టడానికి వెనుకాడితే, నిబంధనలు ప్రకారం వారి ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషను పరిధిల్లో నివసిస్తున్న చెడు నడత కలిగిన పాత నేరస్థులుపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లోనమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను పోలీసు స్టేషనుల వారిగా జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తులో ఉన్నందుకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసేందుకు మార్గదర్శకాలను, సూచనలను సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ చేసారు. త్వరితగతిన కేసుల్లో దర్యాప్తును పూర్తిచెయ్యాలని, నిర్ధేశిత సమయంలోగా కోర్టుల్లో అభియోగ పత్రాలను దాఖలు చెయ్యాలన్నారు. వివిధ పోలీసు స్టేషనులనుండి జిల్లా పోలీసు కార్యాలయంకు పెండింగులో ఉన్న రిఫరెన్సులను, సిసి సెల్ పిటీషనులను, చంద్రన్న భీమా కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, త్వరితగతిన నివేదికలను పంపాలని అధికారులను ఆదేశించారు. వివిధ పోలీసుస్టేషనుల్లో నమోదైన తీవ్రమైన నేరాలను, పోక్సో, ఎన్‌డిపిఎస్ మరియు ఎస్సీ మరియు ఎస్టీ చట్టం క్రింద నమోదైన కేసులను కూడా జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ సమీక్షించి, సంబంధిత అధికారులకు దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన సూచనలను, సలహాలను జిల్లా ఎస్పీ అందించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నమోదైన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కేసులలో అభియోగ పత్రాలను కోర్టుల్లో దాఖలు చేసి, శిక్షలు పడే విధంగా చూడాలనిఅధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, బబ్బిలి ఎఎస్పీ గౌతమీ శాలీ, పార్వతీపురంఎఎస్పీ సుమిత్ గరుడ్, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, విజయనగరం ట్రాఫిక్ డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ జె. పాపారావు, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీలు బి. మోహన రావు, సిహెచ్.పాపారావు, మహిళా పిఎస్ డిఎస్పీ పెంటారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సి.ఎం.నాయుడు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన అవసరం - మున్సిపల్ కమిషనర్ సింహాచలం

### జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా ర్యాలీ




యలమంచిలి : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా యలమంచిలి పట్టణంలో జిల్లా మలేరియా శాఖ ఆదేశాలమేరకు యలమంచిలి సబ్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక సి.హెచ్.సి నందు ఎక్సిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పగలు మాత్రమే కుట్టే ఈ దోమను పుట్టకుండా చేయడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే కుట్టకుండా దోమతెరలు ఏర్పాటు చేయడం, ఇంటి చుట్టుపక్కల నీరు నిలవలేకుండా చూడడం, ఇంటిపైన ట్యాంకులకు మూతలు పెట్టడం వంటివి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అలాగే సి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిని నయం చేయవచ్చని, ఈ లక్షణాలు కనపడిన వెంటనే సి.హెచ్.సికి వస్తే ఎల్లవేళలా వైద్య సదుపాయం కల్పిస్తున్నా మన్నారు. ఐతే వ్యాధి రాకుండా ముందుగానే దోమలు లార్వా దశలో ఉన్నప్పుడే వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ రహదారిపై పురవీధుల్లోనూ సి.హెచ్.సి సిబ్బంది. మెప్మా సిబ్బంది మరియు ప్రజలు కలిసి వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో ఎం.ఆర్.పి నాయుడు, సానిటరి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రవికుమార్, దేవరాజు, ఉష, స్మిత, ఆశ, నారాయణ రావు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొని వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలుపై కరప్రతాలు పంచారు.

## చక్కెర కర్మాగారంలో అగ్నిప్రమాదం

రేగిడి : రేగిడి మండలంలోని సంకిలి ఈఐడీప్యారీ చక్కెర కర్మాగారం కోజెన్‌లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. కర్మాగారం యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. కోజెన్ ఆవరణలో నిల్వచేసి ఉంచిన బెగాస్(చెరకుపిప్పి) కుప్పలకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మంటలు ఎగిసిపడడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. వెంటనే గుర్తించిన యాజమాన్యం పాలకొండ, రాజాం, పొందూరు, ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాజాం, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అనంతరం పొందూరు, ఆమదాలవలస, అరబిందో ఫార్మాకు చెందిన అగ్నిమాపక శకటం చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయి. ప్రమాదంలో కన్వేయర్ బెల్టులు, బెగాస్‌తోపాటు సంబంధిత యంత్ర పరికరాలు దగ్ధమయ్యాయి. నష్టాన్ని అంచనా వేసేందుకు సమయం పడుతుందని కర్మాగారం ఏవీపీ నాగశేషారెడ్డి తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న పాలకొండ ఆర్డీవో విజయబాబు అగ్నిమాపక అధికారులతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరాతీశారు.

## బీఆర్ఏయూ సెట్-2019 పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయం దాని అనుబంధ పీజీ కళాశాలల్లోని పీజీ కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన బీఆర్ఏయూ సెట్-2019 పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. వీటిని వర్సిటీ ఉపకులపతి డా. కూన రామ్‌జీ తన ఛాంబర్‌లో రిజిస్ట్రార్ రఘుబాబుతో కలసి ఫలితాల సీడీ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షను 9విభాగాల్లో నిర్వహించగా మొత్తం 1071మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 871 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన వారిలో 81.32శాతం మంది అర్హత సాధించారన్నారు.

## కాట్రేనికోన లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం లో నేడు డెంగ్యూ నివారణ దినోత్సవం కావడంతో కాట్రేనికోన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక పిహెచ్ సీ నుంచి కాట్రేనికోన గేటు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి డెంగ్యూ వ్యాధి నివారణకు ఏవిధంగా చర్యలు తీసుకోవాలో వివరించారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలను ప్రజలకు ఆసుపత్రి సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎన్ ఎమ్ లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉపకారవేతనానికి ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థి ఎంపిక



అచ్యుతాపురం :కేంద్ర ప్రభుత్వ ఉపకారవేతనానికి స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీనివాసురావు గురువారం తెలిపారు .తమ కళాశాలలో మెకానికల్ మొదటి సంవత్సరం చదువుతున్న కాసారపు అమరనాద్ కి సంవత్సరానికి రూ .20 వేలు చొప్పున మూడు సంవత్సరాలకు రూ .60 వేలు ఉపకారవేతనం వస్తుందని తెలిపారు .పూడిమడక నిరుపేద కుటుంబానికి చెందిన తమ కళాశాల విద్యార్థి కేంద్ర ప్రభుత్వ ఉపకారవేతనానికి ఎంపికైనందుకు కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఆనందం వ్యక్తం చేస్తూ అమరనాద్ ను అభినందించారు.

## మానవ సేవే మాధవ సేవ



విశాఖపట్నం : హెూప్ ఫర్ చేంజ్ సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ లో గల ఆదర్శ వ ృద్ధుల ఆశ్రమంలో వ ృద్ధులకు పంచెలు, చీరలు పంపిణీ జరిగింది. సంస్థ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ ఇంట్లో వేడుకలు అంటే సొంత వాళ్లకి ఆర్భాటాలు లక్షలు ఖర్చు పెట్టే ఆలోచన తప్ప దానిలో కొంత అనాధాలకు పేద వారికీ ఇస్తే అంతకు మించి సంతోషం ఇంకొకటి ఉండదు అనే ఆలోచన కొంతమంది లో మాత్రమే ఉంటుంది అన్నారు. సాయంత్రం పెళ్లి పెట్టుకుని పొలిమేరు నుండి కాకినాడ కి వచ్చి మామూలు విషయం కాదని అన్నారు.

తుమ్మల దొరబాబు తన పెద్ద కుమార్తె, అల్లుడు లితుమ్మల రాజ్య లక్ష్మి, పవన్ సుధీర్‌లి గార్ల పెళ్లి సందర్భంగా పెళ్ళి వేడుకల్లో భాగంగా ఓల్డ్ ఏజ్ హెూమ్‌లి లో పెద్దలకు భోజనాలు పెట్టి చీరలు పంపిణి చేయడం జరిగింది అన్నారు. అలాగే వీరికి లిబ్రెడ్, రస్కులు, గ్లూకోజ్‌లి ఇవ్వడం జరిగిందన్నారు. అందరిలో మార్పు వచ్చే విధంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, వెంకట్, శివ, వెంకి తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

**దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పెంటారావు డిమాండ్**



డాబాగార్డెన్స్: ఇటీవల కాలంలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ దళిత సేన ఆధ్వర్యంలో గురువారం దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, రాష్ట్ర, నగర కమిటీ ఆధ్వర్యంలో విజేఎఫ్ ప్రెస్క్లబ్లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ రోజురోజుకూ దళితులపై అత్యాచారాలు, అగ్రవర్ణాల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అసహనాన్ని వ్యక్తం చేశారు. గుజరాత్ రాష్ట్రంలో బిజెపి ఎమ్మెల్యే అనిల్ ఉపాధ్యాయ నాయకత్వంలో ఓ దళిత వ్యక్తిని కర్రలతో తీవ్రంగా హింసించడం, రాజస్థాన్ రాష్ట్రంలో భర్తను కట్టివేసి భర్త ఎదురుగానే భార్యను మానభంగం చేయడం, అగ్రకులాల వ్యక్తులకు ఎదురుగా నిల్చుని ఒక దళితుడు భోజనం చేస్తున్నాడని ఆగ్రహించి దళితుడిని తీవ్రంగా కొట్టి చంపేయడం, మధ్యప్రదేశ్లో ఒక దళిత వ్యక్తి గుర్రం కొని దానిపై వెళ్తుండగా అగ్ర వర్ణాల వారు తీవ్రంగా కొట్టి చంపడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక దళిత కుటుంబం నచ్చిన పార్టీకి ఓటు వేశారని కుటుంబాన్ని గ్రామం నుంచి వెలివేయడం.. ఈ సంఘటనలన్నీ దళితులపై వివక్షను కళ్ళకు కట్టినట్లు చెబుతోందన్నారు. ఇన్ని అన్యాయాలు జరిగినా ప్రభుత్వం మాత్రం నిద్ర పోతుందా అని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి దళితులపై దాడులను అరికట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో దళిత సేన నాయకులు జి .అప్పారావు, ఎం .నాగమణి, సిహెచ్. ప్రభాకర్, శ్రీనివాసరావు, నరసింహారావు, సీతారాం, కామేశ్వరరావు, కె.రామారావు, జాన్ విక్టర్, యన్. శంకర్రావు, సుగుణ, ఆకుల శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నయనానందకరంగా సత్యదేవుని హారతి సేవ

అన్నవరం......తూ.గో.జిల్లా అన్నవరం రత్నగిరి వాసుడైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి హారతిసేవ నయనానందకరంగా ప్రారంభమైంది.బుధవారం రాత్రి మూలవిరాట్‌కు వేద పండితులు పవిత్ర మంత్రోచ్ఛరణల నడుమ ఓంకార,హంస,బిల్వ, నాగసర్ప,గరుడ,కుంభ,నక్షత్ర, కర్పూర హారతులు ఇచ్చారు. ఈ హరతులకు వినియోగించే వెండి సామాగ్రిని శ్రీలలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (పెద్దాపురం) అధినేతలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాసులు దేవస్థానానికి అందచేశారు. ఇందులో పాల్గొనే దంపతులకు రూ.500 టికెట్టుగా నిర్ణయించారు. ప్రతీరోజు రాత్రి 7 గంటల నుంచి 7.30 వరకు హారతిసేవను నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంవి సురేష్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా దాతలను దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్, కార్యనిర్వహణాధికారి ఎంవి సురేష్ బాబు,ఏసి.ఈరంకి.జగన్నాధరావు,పిఆర్వో తులా.రాముడు,దేవస్థానం సిబ్బంది,తదితరులు అభినందించారు.

## శ్రీ స్వామి, అమ్మవార్లకు అరుంధతి నక్షత్ర దర్శనం



అన్నవరం......తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దివ్య కళ్యాణోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ స్వామివారి, అమ్మవార్ల దివ్య కళ్యాణం జరిగిన సందర్భంగా గురువారం వైశాఖ శుద్ధ ద్వాదశి, త్రయోదశి సాయంత్రం 6 గంటల నుండి ప్రముఖ వ్యాఖ్యాత మాడుగుల.నాగఫణి శర్మ వారి బృందంచే అష్టావధాన కార్యక్రమం జరిగింది.అనంతరం రాత్రి 7 గంటలకు అరుంధతి నక్షత్ర దర్శనం శాస్త్రోక్తంగా నిర్వహించి నవ దంపతులైన శ్రీ స్వామి, అమ్మవార్లకు అర్చకులు అరుంధతి నక్షత్ర దర్శనం కల్పించారు.అనంతరం రాత్రి 9 గంటలకు గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లను కొండదిగువన రావణ వాహనము మరియు పొన్న వాహనముపై ఊరేగింపు ఉత్సవము అత్యంత వైభవంగా జరిగింది.

## నిస్వార్థ సేవతో జీవితం సార్థకత



విశాఖపట్నం :- స్వసమవేద్యానందజీ జగదాంబ జంక్షన్ దరి రోటరీ బ్లడ్ బ్యాంక్లో గల రోటరీ గ్రాండ్యూర్లో భారత వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ రామకృష్ణ స్వామి మిషన్ స్వామిజీ స్వసమవేద్యానందజీ హాజరై జ్యోతిని వెలిగించి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన సభికులనుద్దేశించి ప్రసంగిస్తూ నిస్వార్థ సేవతో జీవితం సార్థకత అవుతుంది గనుక ప్రతి ఒక్కరు స్వలాభపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. వేద భూమిగా భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. భారత వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ చేపడుతున్న సేవాకార్యక్రమాలను ప్రసంశించారు. గౌరవ అతిథులుగా భారత వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షులు రమేష్ చంద్ జైన్, దక్షిణ ప్రాంతీయ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్, కార్యదర్శి ఎస్. సోమరాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 2019-20కి గాను బి.వి.పి. నగర శాఖ నూతన కార్యవర్గం: అధ్యక్షునిగా శేఖరమంత్రి ప్రభాకర్, కార్యదర్శిగా ఎస్. సోమరాజు, కోశాధికారిగా పేర్ల భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా ఎం. ఎస్. ఎల్. శైలజ, పి.ఎల్.కె. మూర్తి, సంయుక్త కార్యదర్శిగా జి.అరుణజ్యోతి, నగర శాఖ మీడియా ఇన్ చార్జ్ మరియు పిఆర్ఓగా ఎం.వి.రాజశేఖర్లు ఎన్నికైయ్యారు.

ఈ కార్యక్రమంలో పూర్వ కార్యదర్శి సిహెచ్.వి. సత్యన్నారాయణ, సంస్థ సభ్యులు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



గాజువాక: షీలానగర్ డైరీ ఆసుపత్రి సమీపంలో రహదారివద్ద తులసీ ఆటో స్టాండ్ ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపియం నాయకులు జి.సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ వేసవి తాపానికి ప్రజలు విలవిలలాడుతున్నారని, ముఖ్యమైన పనులుంటేే తప్ప ఇళ్ళకే పరిమితమవుతున్నారని అన్నారు. అయితే పాదచారులకు వాహనదారులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం బాగుందని, ఇటువంటి సామాజికసేవా కార్యక్రమాలలో ప్రతీ ఒక్కరూ పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ

ఖమ్మం : జాతీయ కీటక వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఖమ్మంలో డెంగ్యూ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రదర్శనను స్థానిక పెవిలియన్ మైదానంలో డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ కళావతిభాయ్, నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇక్కడ నుంచి కార్యక్రమంలో భాగంగా మయూరి సెంటర్ వైరా రోడ్ మీదుగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వరకూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### మంజూరైన ఇంజనీరింగ్

## పనులను సత్వరం ప్రారంభించండి

**- మే 24 తరువాత ఇంజనీరింగ్ పనులను ప్రారంభించండి - 2017-18 సంవత్సరంలో 70 పాఠశాలలకు మరమ్మత్తులు**

**- మిగిలిన జివియంసి పాఠశాలల పెండింగ్ పనులు చేపట్టండి - నెల రోజులపాటు కాలువలు, గెడ్డల పూడికతీత పనులకు ప్రాధాన్యత**

**- యుద్ధ ప్రాతిపదికతన పాఠశాలల నిర్వహణ - *కమిషనర్ హరినారాయణన్***

విశాఖపట్నం :- మంజూరై అనుమతించిన ఇంజనీరింగ్ పనులను (సత్వరం) మే 24 తరువాత ప్రారంభించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. 2017-18 సంవత్సరంలో 70 మున్సిపల్ పాఠశాలలకు ఆధునీకరణ, మరమ్మత్తులు చేపట్టారని మిగిలిన పాఠశాలల పెండింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. మే 24 నుండి జూన్ 24 వరకు నెలరోజులపాటు గెడ్డలు, కాలువల పూడికతీత పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా యుద్ధ ప్రాతిపదికన పాఠశాలల నిర్వహణ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ తాజా పరిస్థితిపై నివేదిక అందజేయాలని కోరారు. టాయిలెట్స్ మరమ్మత్తులు, నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. కమిషనర్ అనుమతించిన స్థలాలలోనే కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని ఆదేశించారు. ఏ.ఇల వారీగా పనుల నిర్వహణపై సమీక్షించారు. తదుపరి 15 రోజుల తరువాత పనుల వారీగా సమీక్షిస్తారని స్పష్టం చేశారు.

సమీక్షలో చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, యస్.ఇ ప్రసాదరాజు, వినయ్‌కుమార్, మరియన్న, శ్యాంసన్‌రాజు, అందరు ఇఇలు, డిఇలు, ఏ.ఇలు తదితరులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



ఇచ్చోడ : బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని చైల్డ్‌లైన్ సంస్థ జిల్లా సమన్వయకర్త జె.తిరుపతి అన్నారు. ఆయన ఇచ్చోడ మండలం అడెగామ పంచాయతీ భీమన్నగుట్ట గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంచార జీవనం గడుపుతున్న పిల్లలే ఎక్కువగా బాలకార్మికులుగా మారుతున్నారని, వారందరిని ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. గ్రామ సర్పంచి అనితసుభాష్‌రెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు.

## ఆ సెట్‌లో ఐదో ర్యాంక్ సాధించిన రమ్యాఅనూషా



సింథియా: ఆసెట్‌లో వెలగల రమ్మ అనూషా 5వ ర్యాంక్‌ను సొంతచేసుకుంది. గురువారం విడుదల అయిన ఆసెట్ ఫలితాలలో ఆమె ఈ ర్యాంకును సాధించింది. పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం జవహార్‌నగర్‌లో నివాస ముంటున్న వెలగల రమ్య అనూషా ఇటీవల జరిగిన ఆసెట్ (ఎంహెచ్‌ఆర్‌ఎమ్) పరీక్ష రాసింది. గరువారం విడుదలైన ఫలితాలలో రమ్య ఉత్తమ ర్యాంక్ సాధించడంతో స్నేహితులు, తల్లిదండ్రులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ ప్రతీ రోజు రెండు గంటలు శ్రమించి చదివానని, ప్రణాళిక బద్ధంగా చదవడంతో ఈ ర్యాంకును సాధించినట్లు తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్యాహంతో చదివి ఈ ర్యాంకును సాధించినట్లు తెలిపింది. 1వతరగతి నుంచి పదోవ తరగతి వరకు స్థానిక నేవీ చిల్డ్రన్ పాఠశాలలో, ఇంటర్ శ్రీచైతన్య కళాశాల, డిగ్రీ చైతన్య మహిళ డిగ్రీ కళాశాలలో చదివిందని తెలిపింది. తండ్రి వెంకట భాస్కర్‌రెడ్డి ఓసంస్థలో ఒప్పంద కార్మికునిగా పనిచేయగా తల్లి రాధ గృహిణి. హెచ్.ఆర్. కావాలనేది రమ్య సంకల్పమని రమ్య తెలిపింది.

## పూడిమడకలో మెరైన్ పోలీసుల ఉచిత కంటి వైద్య శిబిరం



అచ్యుతాపురం : మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో గురవారం మెరైన్ పోలిసుల అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెరైన్ డి ఐజి ఎ ఎస్ ఖాన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు .

## గిరి విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి



శాంతినగర్ : గిరిజన విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణిస్తూ క్రీడల్లోనూ ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ తమ సత్తా చాటాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. ఆదిలాబాదఖ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానం లో మే 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ముగించారు. ప్రభుత్వ కొలాం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై గిరిజన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వ ృథా కాకుండా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గిరిజన విద్యార్థులను ఎంపిక చేసి హాకీ, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడాంశాల్లో మరింత రాటుదేలాలా 200 మందికి శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. దీంతో ఆయా క్రీడాంశాల్లో గిరి విద్యార్థులు మరింత నైపుణ్యాన్ని సాధించడంతో పాటు పోటీల్లో విజయం సాధించవచ్చన్నారు. గిరి విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలువాలని ఆకాం క్షించారు. అనంతరం గిరిజన క్రీడల ఉమ్మడి జిల్లా అధికారి కోరెడ్డి పార్థసారథి మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ప్రోత్సాహంతో గిరి విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గత సంవత్సరం భద్రాచలంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ గిరి విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారని గుర్తు చేశారు.

# మార్కెట్లు మళ్లీ పడ్డాయి..

ముంబై: స్టాక్ మార్కెట్ల ఒక్కరోజు ర్యాలీకి బ్రేక్‌పడింది. అంతర్జాతీయ వాణిజ్యంపై ఆందోళన మరింత తీవ్రతరమవుతుండటం, ఎన్నికలకు సంబంధించి అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో మార్కెట్లు దిగువముఖం పట్టాయి. ప్రారంభం నుంచి చివరి వరకు ఆటు ఇటుగా 500 పాయింట్ల వరకు కదలాడిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు 203.65 పాయింట్లు లేదా 0.55 శాతం తగ్గి 37,114.88 వద్దకు జారుకున్నది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 65.05 పాయింట్లు కోల్పోయి 11,157 వద్ద ముగిసింది. వరుసగా తొమ్మిది సెషన్లపాటు భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభపడ్డాయి. అయినప్పటికీ ఆ మరుసటి రోజే మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో దిగువముఖం పట్టాయని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. యెస్ బ్యాంక్, టాటా మోటర్స్ షేర్లు అత్యధికంగా నష్టపోవడం మార్కెట్ల పతనాన్ని శాసించాయి. వీటితోపాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోల్ ఇండియా, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, మారుతి, ఎల్ అండ్ టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్ 4.11 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఐటీసీ, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు ఒక్కశాతానికి పైగా మార్కెట్



వాటాను పెంచుకున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 70 డాలర్ల పైన తచ్చాడుతుండటం కూడా మార్కెట్ల పతనానికి ఆజ్యం పోసిందన్నారు. భగ్గుమన్న చమురు ధరల కారణంగా దేశీయ వాణిజ్య లోటు మరింత ఎగబాకే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు.

# వండర్‌లా లాభంలో 90 శాతం వృద్ధి

హైదరాబాద్: దేశంలో అతిపెద్ద అమ్యూజ్‌మెంట్ పార్క్ నిర్వహణ సంస్థ వండర్‌లా హాలీడేస్ లిమిటెడ్ గతేడాది చివరి త్రైమాసికంలో రూ.6.99 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.3.68 కోట్ల తో పోలిస్తే 90 శాతం పెరుగుదల కనిపించింది. జనవరి-మార్చి మధ్యకాలంలో కంపెనీకి రూ.63.55 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన త్రైమాసికంలో బెంగళూరులో ఉన్న పార్క్‌ను సందర్శించిన వారిలో 10 శాతం పెరుగుదల కనిపించగా, అదే హైదరాబాద్, కొచ్చి పార్క్‌ల్లో 5 శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న మూడు పార్కులు, రిసార్ట్‌లు మెరుగైన పనితీరు కనబరిచినట్లు కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ జోసెఫ్ తెలిపారు.




గతేడాది మొత్తానికి రూ.291.66 కోట్ల ఆదాయంపై రూ.55.41 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది.

# ఎగుమతుల్లో నీరసం

## -నాలుగు నెలల కనిష్ఠానికి క్షీణత.. ఐదు నెలల గరిష్ఠానికి చేరిన వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: దేశీయ ఎగుమతుల్లో మళ్లీ నీరసం ఆవరించింది. గడిచిన కొన్ని నెలలుగా రెండంకెల వ ృద్ధిలో దూసుకుపోయిన ఎగుమతులు ఏప్రిల్ నెలకుగాను వ ృద్ధి 0.64 శాతానికి పరిమితమైంది. ఇంజినీరింగ్ గూడ్స్, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, లెదర్, ఇతర ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ లేకపోవడంతో నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఇదే సమయంలో దిగుమతులు 4.5 శాతం పెరిగాయి. గడిచిన ఆరు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి పనితీరు. దీంతో వాణిజ్య లోటు ఐదు నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. క్రూడాయిల్, పసిడి దిగుమతులు అమాంతం పెరిగాయి.

గత నెలలో 26 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతి చేసిన భారత్..ఇదే నెలలో 41.4 బిలియన్ డాలర్ల వస్తువులను దిగుమతి చేసుకున్నది. వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 15.33 బిలియన్ డాలర్లు. నవంబర్ 2018 తర్వాత వాణిజ్యలోటు ఇదే గరిష్ఠమని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఇంజినీరింగ్, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, లెదర్, కార్పెట్, ప్లాస్టిక్, సముద్ర ఉత్పత్తులు, బియ్యం, కాఫీ ఎగుమతుల్లో ప్రతికూల వ ృద్ధి




నమోదవడంతో మొత్తం పనితీరుపై ప్రభావం చూపాయి. గతంలో 0.34 శాతం వ ృద్ధిని డిసెంబర్ 2018 నెలలో కనబరిచింది. ఇప్పటి వరకు ఇదే చారిత్రక కనిష్ఠ స్థాయి. గత నెలలో భారత్ 11.38 బిలియన్ డాలర్ల విలువైన చమురును దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో చేసుకున్న దాంతో పోలిస్తే 9.26 శాతం అధికం. అలాగే చమురేతర దిగుమతులు 2.78 శాతం పెరిగాయి.

భారీగా పెరిగిన పసిడి దిగుమతులు

కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న పసిడి దిగుమతులు మళ్లీ ఝులువిదిల్చాయి. గత నెలలో 3.97 బిలియన్ డాలర్ల విలువైన పసిడి వచ్చిచేరింది. ఏడాది క్రితం దిగుమతి చేసుకున్న దాంతో పోలిస్తే 54 శాతం అధికం. పెట్రోలియం, హస్తకళలు, రెడీ-మేడ్ దుస్తులు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల్లో ఆశావాద వ ృద్ధిని నమోదు చేసుకున్నాయి. గత నెల గణాంకాలు ఆకట్టుకునే స్థాయిలో లేవని ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(టీపీసీఐ) వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ ఉత్పత్తులకు వచ్చిన దన్నుతోపాటు టీ, పండ్లు, కూరగాయల ఎగుమతులు ఆశించిన స్థాయిలో పెరుగుతున్నాయని టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా తెలిపారు. ఎగుమతుల గణాంకాలు ప్రోత్సహకరంగా లేవని, కార్మిక రంగాల్లో ప్రతికూలానికి పడిపోయాయన్నారు.

సరినన్ని నిధుల లభించకపోవడంతో అన్ని రంగాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వీటితోపాటు వాణిజ్య యుద్ధమేఘాలు, రక్షణాత్మక చర్యలు దేశీయ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతి అధికమవుతుండటంతో భవిష్యత్తులో వాణిజ్యలోటు మరింత పెరిగే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు. ఇరాన్ నుంచి చమురును దిగుమతి చేసుకోవద్దన అగ్రరాజ్యం అమెరికా ఆంక్షలు ఇతర దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

# విమర్శల్ని స్వీకరించాల్సిందే!

‘కథలలో నవ్యత ఉన్నప్పుడే కొత్తగా సంగీతాన్ని అందించడానికి అవకాశం దొరుకుతుంది’ అని అన్నారు అనూప్‌రూబెన్స్. ఆయన స్వరకర్తగా పనిచేస్తున్న చిత్రం ‘సీత’. తేజ దర్శకుడు. బెల్లంకొండ శ్రీనివాస్, కాజల్ అగర్వాల్ కథానాయికలు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో అనూప్‌రూబెన్స్ మాట్లాడుతూ ‘సీత అనే పాత్ర చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో పాటలు, నేపథ్యసంగీతం కథానుగుణంగానే ఉంటాయి. ఇప్పటికే విడుదల చేసిన ‘బుల్‌రెడ్డి..’,‘నిజమేనా..’ గీతాలకు మంచి స్పందన లభిస్తున్నది. మ్యూజికల్‌గా ‘జయం’ రోజులు గుర్తొచ్చాయని అంటున్నారు. పెద్ద సినిమాలు కొన్ని వర్కవుట్ కాకపోవడంతో సంగీత దర్శకుడిగా ఏడాదిపాటు విరామం తీసుకున్నాను. ప్రశంసల్ని స్వీకరించినప్పుడు విమర్శల్ని అంగీకరించాల్సిందే. గతంలో ఏడాదికి పది వరకు సినిమాలు చేశాను. ఆ సమయంలో తెలియకుండానే కొన్ని సార్లు ఒకే రకమైన ట్యూన్స్ పునరావ ృతం అయ్యాయి. పని ఒత్తిడి



వల్లే అలా జరిగింది. తెలుగులో కార్తికేయ నటిస్తున్న ‘90ఎమ్ఎల్’తో పాటు కన్నడంలో ‘సీతారామకళ్యాణం’, హీరో గణేష్‌తో మరో చిత్రాన్ని చేస్తున్నాను.

# ప్రబోధాత్మక చిత్రం ‘మహర్షి’



‘వ్యవసాయాన్ని పరిరక్షిస్తూ అన్నదాతలకు అండగా నిలబడాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పిన ప్రబోధాత్మక చిత్రం ‘మహర్షి’’ అని అన్నారు ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు. కుటుంబంతో కలిసి ఆయన ‘మహర్షి’ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా ట్విట్టర్ వేదికగా వెంకయ్యనాయుడు సినిమాపై ప్రశంసలు కురిపించారు. ‘గ్రామీణ ఇతివ ృత్తంతో మంచి సందేశంతో రూపొందిన చిత్రమిది. గ్రామీణ ప్రజల సౌభాగ్యాన్ని, వ్యవసాయ ప్రాధాన్యతను గుర్తుకుతెచ్చిన సినిమా. మహేష్‌బాబు సహజమైన నటనను కనబరిచాడు’ అని అన్నారాయన. వెంకయ్యనాయుడు వ్యాఖ్యలపై మహేష్‌బాబు ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ ‘వెంకయ్యనాయుడుగారి ప్రశంసల్ని నాతో పాటు మా చిత్ర యూనిట్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇంతకు మించిన అభినందన మరొకటి ఉండదనుకుంటున్నాను. ‘మహర్షి’ వంటి మరెన్నో మంచి సినిమాలు చేయడానికి ఆయన మాటలు స్ఫూర్తినిచ్చాయి’ అని అన్నారు. వెంకయ్యనాయుడు ప్రశంసలు తమకెప్పటికి గుర్తుండిపోతాయని, ఇది తమపై ఉన్న బాధ్యతను మరింత పెంచిందని దర్శకుడు వంశీపైడిపల్లి పేర్కొన్నారు.

# చిత్రభాను

## సుకుమార్ సలహా పాటిస్తున్నా!

**ఘనమైన సినీ నేపథ్యం, వారసత్వం అన్ని ఉన్నా ఆరేళ్ల సినీ ప్రయాణంలో కేవలం ఐదు సినిమాలు మాత్రమే చేశారు అల్లు శిరీష్. కథాంశాలు, పాత్రల పరంగా నవ్యతకు ప్రాధాన్యతనిస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘ఏబీసీడీ’. తన నిజజీవితానికి దగ్గరగా ఉన్న కథ ఇదని, హీరో పాత్రలో తనను తాను చూసుకున్నానని చెబుతున్నారు అల్లు శిరీష్. సంజీవ్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా అల్లు శిరీష్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**

**‘ఒక్కక్షణం’ తర్వాత రీమేక్ కథతో సినిమా చేయడానికి కారణం ఏమిటి?**

మలయాళంలో దుల్కార్ సల్మాన్ నటించిన ‘ఏబీసీడీ’ చిత్రాన్ని రెండేళ్ల క్రితం చూశాను. చాలా నచ్చింది. ఈ సినిమాను తెలుగులో నేను రీమేక్ చేస్తే బాగుంటుందని రామ్‌చరణ్, వరుణ్‌తేజ్, మారుతితోపాటు ఇండస్ట్రీలోని పరిచయస్తులు, స్నేహితులు చాలా మంది చెప్పారు. వినోదం, భావోద్వేగాలు, ప్రేమ, నాటకీయత సమపాళ్లలో ఉండే చిత్రమిది. అమెరికా నుంచి ఇండియా వచ్చిన ఓ యువకుడి జీవితగమనానికి చక్కటి ద ృశ్యరూపంగా ఉంటుంది.

**ట్రైలర్ చూస్తుంటే రాజకీయ అంశాలతో ముడిపడిన సినిమాలా అనిపిస్తున్నది?**

హీరో పాత్రలో మార్పు తీసుకురావడానికి రాజకీయ పరమైన అంశాలు ఓ కారణంగా నిలుస్తాయి. అంతే తప్ప పూర్తిగా రాజకీయ నేపథ్యంతో ముడిపడిన సినిమా కాదిది.

**ఈ సినిమాను చాలా మంది ‘పిల్లజమీందార్’తో పోల్చుతున్నారు. ప్రీ రిలీజ్ వేడుకలో నాని అదే మాటన్నారు. ఆ సినిమాతో ఏమైనా పోలికలు ఉంటాయా?**

‘పిల్ల జమీందార్’తో ఎలాంటి పోలికలు ఉండవు. ఆ సినిమా తాత, మనవడి మధ్య ఛాలెంజ్ ప్రధానంగా సాగుతుంది. మా సినిమా తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగుతుంది. అమెరికా సంస్క ృతికి అలవాటుపడిన ఓ కొడుకులో మార్పు కోసం తపించే ఓ తండ్రి కథ ఇది. ఇండియాలో ఓ మురికివాడలో నివసించే యువకుడు డబ్బు, మనిషి విలువ ఎలా తెలుసుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది.

**ఈ సినిమా కథ విషయంలో ఇతర దర్శకుల సలహాలు తీసుకున్నాం అని అన్నారు?**

రీమేక్ కథ కావడంతో తప్పులు జరగకుండా ఉండాలనే క ృష్ణచైతన్య, బీవీఎస్రవి, గోపీమోహన్, పవన్‌సాధినేనితో పాటు అందరి సలహాలు తీసుకున్నాం. స్నేహితులుగానే అందరూ స్క్రిప్ట్ బాగా రావడానికి బాగా సహకరించారు. రచయిత సత్యానంద్ కొన్ని అవసరమైన మార్పులు చేశారు.

**సినిమాల మధ్య చాలా గ్యాప్ తీసుకుంటున్నారు కారణం ఏమిటి?**

నా సినిమాలన్నీ ఎందుకు ఆలస్యం అవుతున్నాయో తెలియదు. నా వైపు తప్పులు ఏమీ లేవు. సినిమాల విషయంలో నిర్లక్ష్యంగా ఉండను. సరైన సమయంలో సినిమాల్ని పూర్తిచేయడానికి ప్రయత్నిస్తుంటాను. కానీ అనివార్య కారణాల వల్ల ‘ఒక్కక్షణం’తో పాటు ఈ సినిమా విడుదల




ఆలస్యమైంది.

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

రొమాన్స్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. ఓ ప్రేమకథతో తదుపరి సినిమా చేయబోతున్నాను. కొత్త దర్శకుడు ఈ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు.

స్క్రిప్ట్‌ను ఓ బైబిల్‌గా భావించి దానిని పూర్తిగా ఫాలో అవ్వకుండా వినోదం, ప్రేమ సన్నివేశాల్ని నటుడిగా నా శైలిలో ఇంప్రూవైజ్ చేయడానికి ప్రయత్నిస్తుంటాను. గతంలోఓ సందర్భంలో దర్శకుడు సుకుమార్ ‘దర్శకుడు చెప్పింది చేసేవాడు డీసెంట్ యాక్టర్..అలా చేయడంతో పాటు కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తూ దర్శకుల్ని సర్‌ప్రైజ్ చేసేవాడు గుడ్‌యాక్టర్ ’అని చెప్పారు. అప్పటి నుండి ఆయన సలహాను పాటిస్తున్నాను.

# కడలల్లె వేచె కనులే..



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘డియర్ కామ్రేడ్’. భరత్ కమ్మ దర్శకుడు. మైత్రీమూవీ మేకర్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ ఎర్నేని, రవిశంకర్, మెహన్ చెరుకూరి, యశ్ రంగినేని నిర్మిస్తున్నారు. జూలై 26న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సినిమాలోని ఓ లిరికల్ వీడియాను విజయ్ దేవరకొండ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ‘కడలల్లె వేచె కనులే, కదిలేను నదిలా కలలే..ఒడిచేరి ఒకటై పోయే తీరం కోరే ప్రాయం..’ అంటూ సాగే ఈ గీతాన్ని సిధ్‌శ్రీరామ్, ఐశ్వర్యా రవిచంద్రన్ ఆలపించారు. జస్టిన్ ప్రభాకరణ్ స్వరకర్త. ఈ సినిమా పాట విని భావోద్వేగానికి లోనయ్యానని, ఇంటిలో పాట వింటున్నప్పుడు అమ్మ కళ్లలో కన్నీళ్లు రావడం చూశానని విజయ్ దేవరకొండ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ వైద్యవిద్యార్థిగా, రష్మిక మందన్న మహిళా క్రికెటర్ పాత్రలో కనిపించనున్నారు. కాకినాడ నేపథ్యంలో జరిగే కథ ఇదని చిత్ర బ ృందం తెలిపింది. ఇటీవలే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది.

# ఆసెట్ పరీక్ష ఫలితాలు విడుదల

## 19 నుంచి వెబ్‌సైట్‌లో ర్యాంకు కార్డులు .. మే 29 నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం



ఆంధ్ర విశ్వకళాపరిషత్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ, సమీకృత కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఆసెట్, ఆఈట్ ప్రవేశ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. గురువారం ఉదయం 11.30 గంటలకు ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫలితాలను ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు విడుదల చేశారు. ఫలితాలను ఏయూ ప్రవేశాల సంచాలకులు వెబ్‌సైట్‌లోను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య నిమ్మ వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేసిన అనంతరం వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు వివరాలు వెల్లడించారు. ఆసెట్ ప్రవేశ పరీక్షకు 19219 దరఖాస్తు చేసారని, వీరిలో 17133 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఇంజనీరింగ్ కోర్సులకు నిర్వహించిన ఆఈట్ పరీక్షలకు 3191 మంది దరఖాస్తు చేయగా 2790 మంది హాజరయ్యారన్నారు. ఆసెట్‌కు 89.7, ఆఈట్‌కు 87.43 శాతం హాజరు నమోదయ్యిందన్నారు. ఈనెల 9,10 తేదీలలో పరీక్షలు జరగాయని, రికార్డు సమయంలో కేవలం 5 రోజుల వ్యవధిలోనే ఫలితాలను విడుదల చేసామన్నారు.

అసెట్ సైన్స్ కోర్సుల్లో జియాలజీ పరీక్ష రాసిన అబ్దుల్ లతీఫ్ 91 మార్కులతో టాపర్‌గా, ఆర్ట్స్ విభాగంలో తెలుగు విభాగంలో వాసా గణపతిరావు 86 మార్కులతో టాపర్‌గా, సమీకృత ఇంజనీరింగ్ కోర్సులకు నిర్వహించిన ఆఈట్ పరీక్షల్లో తంగిరాల జయ శ్రీ లక్ష్మి సావిత్రి 81 మార్కులతో టాపర్‌గా నిలచారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంతోపాటు గురజాడ అప్పారావు విశ్వవిద్యాలయం(విజయనగరం) సీట్లు సైతం ఆసెట్‌తో భర్తీ చేయడం జరుగుతోందన్నారు.

***29 నుంచి కౌన్సెలింగ్....***

ర్యాంకు కార్డులను ఈ నెల 19 నుంచి వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక విభాగాల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, విజయవాడలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాలలో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందన్నారు. విద్యార్థులు జూన్ 3 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. తొలిదశ సీట్లుభర్తీ జూన్ 11న వెల్లడిస్తామన్నారు. రెండో దశ కౌన్సెలింగ్ జూన్ 16 నుంచి 18 వరకు జరుగుతుందని, రెండో దశ సీట్లు భర్తీ వివరాలు జూన్ 24న విడుదల చేస్తామన్నారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.

# దేశంలోనే 10 ఉన్నత పోలీసు స్టేషనుల్లో సీతానగరం స్టేషన్‌కు స్థానం



విజయనగరం: దేశంలోనే 10 ఉత్తమ పోలీసు స్టేషనుల్లో ఒక్కటిగా సీతానగరం పోలీసు స్టేషను ఎంపిక కావడం, కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక గుర్తింపు లభించడం జిల్లా పోలీసుశాఖ సాధించిన విజయంగా జిల్లా ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. ఉత్తమ పోలీసు స్టేషను ఎంపికలో భాగంగా కేంద్ర పరిశీలన బృందం ప్రాథమిక పరిశీలనకుగాను రాష్ట్రంలో ఐదు పోలీసు స్టేషనులును ఎంపిక చెయ్యగా, వాటిలో మూడు పోలీసు స్టేషనులు విజయనగరం జిల్లా నుండి ఎంపిక కావడంవిజయనగరం జిల్లా పోలీసుల పనితీరుకు నిదర్శనమన్నారు. కేంద్ర పరిశీలన బృందం విజయనగరం జిల్లాలో పర్యటించిపార్వతీపురం రూరల్, బుదరాయవలస మరియు సీతానగరం పోలీసు స్టేషనులను పరిశీలించి, పరిసరాల శుభ్రత, రికార్డుల మెయింటెనెన్సు, సిబ్బంది పనితీరు, పోలీసు స్టేషనులో ఆహ్లాదకర వాతావరణం కల్పించడం, కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణ వంటి అంశాలను పరిశీలించి సీతానగరం పోలీసు స్టేషనును అవార్డు కొరకు సిఫార్సుచేసిందన్నారు. అప్పటి సీతానగరం ఎస్ఐ డి. సాయికృష్ణ, ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఐ ఎస్. కృష్ణమూర్తి రాష్ట్ర డిజిపి ఆర్.పి. ఠాకూర్ చేతుల మీదుగా కేంద్ర హెూంశాఖ జారీ చేసిన అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో సీతానగరం పోలీసు స్టేషనుకే కేంద్ర స్థాయి గుర్తింపు లభించడం, అందుకు భాగస్వామ్యులు అయిన పోలీసు సిబ్బంది, అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

# పోలవరం ప్రాజెక్టుపై విచారణకు ఆదేశించండి

హైదరాబాద్ : కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను గురువారం కలిశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై గవర్నర్‌కు ఆయన రిప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంపై శ్వేతపత్రం ఇచ్చేలా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. పోలవరంపై ఏపీ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కౌంటర్ వేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఆధారాలతో సహా గవర్నర్‌కు వివరించానని కేవీపీ వెల్లడించారు.

# అంతర్జాతీయ సదస్సుకు భాగ్యనగరం వేదిక

## 31వ వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్: మరో అంతర్జాతీయ సదస్సుకు భాగ్యనగరం వేదిక కానుంది. 31వ వరల్డ్ డిజైన్ అసెంబ్లీ సమావేశాలు అక్టోబర్ 11, 12 తేదీల్లో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనున్నాయి. దీనికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని వరల్డ్ డిజైన్ ఆర్గనైజేషన్ తన వెబ్‌సైట్‌లో పొందుపరచగా.. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ విషయాన్ని ట్విటర్‌లో పంచుకున్నారు. వెల్‌కమ్ టు హైదరాబాద్, ఇండియా అని స్వాగతం పలుకుతూ ట్వీట్ చేశారు.

# విధులు, అర్హతల గురించి వివరించాం

## వైకాపా ఏజెంట్లకు కౌంటింగ్‌పై శిక్షణా శిబిరం



విజయవాడ : తొలి ఓటు నుంచి చివరి ఓటు లెక్కింపు వరకు ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సూచించారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో గురువారం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సాఆర్ సీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ సీఎస్ అజయ్ కల్లాం, రిటైర్డ్ ఐఏఎస్ శామ్యూల్ తదితరులు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు.

# పోలింగ్ జరిగిన ఇన్నాళ్లకు రీపోలింగా!?

తిరుపతి: చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై తెలుగుదేశం పార్టీ భగ్గుమంది. ఈసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తిరుపతి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఏపీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నాని సహా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. పోలింగ్ ముగిసిన నెల తర్వాత వైకాపా ఫిర్యాదు చేస్తే ముందూ.. వెనుక ఆలోచించకుండా ఈసీ నిర్ణయం తీసుకోవడమేంటని మండిపడ్డారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఎన్.ఆర్.కమ్మపల్లి, పులవర్తివారి పల్లి, కొత్త కండ్రిగ, కమ్మపల్లి, వెంకటరామాపురం కేంద్రాల్లో ఏప్రిల్ 11న జరిగిన ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, అక్కడ రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ చంద్రగిరి వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గతంలో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.


# INDIAN NAVY

AN OCEAN OF OPPORTUNITIES

భారతదేశం అవివాహిత పురుషులు మరియు మహిళల నుంచి పర్మినెంట్ కమీషన్(పిసి) మరియు షార్ట్ సర్వీస్ కమీషన్ (ఎస్ఎస్‌సి)లో క్రింద పేర్కొన్న భారతదేశంలోని (బ్రాంచీలు/ఎంట్రీలలో ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్ఇటి) ద్వారా ఇండియన్ నావల్ అకాడమీ ఎజిమాలా, కేరళలో జూన్ 2020లో ప్రారంభమగు కోర్సు కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుచున్నారు.

**అర్హతా ప్రమాణాలు**

| క్రసం | బ్రాంచి/క్యాడర్ | బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్/బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ మరియు ఇతర విద్యార్హతల అర్హతల వివరాలు | ఖాళీలు | లింగం | మధ్య జన్మించిన వారు (రెండు తేదీలు కలుపుకొని) |
|---|---|---|---|---|---|
| ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ | | | | | |
| (ఎ) | ఎస్ఎస్ఇ నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ క్యాడర్ (ఎన్ఎఐసి) | ఎఐసిటిఇ మంచి గుర్తింపు పొందిన విద్యాసంస్థ/విశ్వవిద్యాలయం నుంచి కనీసం 60% మార్కులతో బిఇ/బి.టెక్ అభ్యర్థి తరగతి 10 మరియు 12లో మొత్తంగా 60% మార్కులు మరియు తరగతి 10 లేదా తరగతి 12లో ఆంగ్లంలో కనీసం 60% మార్కులు తప్పక పొంది ఉండాలి. 1. మెకానికల్ 2. ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్/మైక్రో ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్/ఇనుస్ట్రుమెంటేషన్ & కంట్రోల్/కంట్రోల్ ఇంజనీరింగ్ 3. ప్రొడక్షన్/ఇండస్ట్రియల్ ప్రొడక్షన్/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ 4. అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ & ఇనుస్ట్రుమెంటేషన్ /ఎలక్ట్రానిక్స్ & ఇనుస్ట్రుమెంటేషన్ 5. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్సు /కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ అప్లికేషన్ 6. మెటలర్జీ/మెటలర్జికల్/కెమికల్/మెటీరియల్ సైన్సు 7. ఎరోస్పేస్/ఏరో నాటికల్ ఇంజనీరింగ్ 8. ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ | 08 | పురుషులు & మహిళలు | 02 జూలై 1995 & 01 జనవరి 2001 |
| (బి) | ఎస్ఎస్‌సి ఎటిసి | ఎఐసిటిఇ మంచి గుర్తింపు పొందిన విద్యాసంస్థ/విశ్వవిద్యాలయం నుంచి కనీసం 60% మార్కులతో బిఇ/బి.టెక్ అభ్యర్థి తరగతి 10 మరియు 12లో మొత్తంగా 60% మార్కులు మరియు తరగతి 10 లేదా తరగతి 12లో ఆంగ్లంలో కనీసం 60% మార్కులు తప్పక పొంది ఉండాలి. | 04 | పురుషులు & మహిళలు | 02 జూలై 1995 & 01 జూలై 1999 |
| (సి) | ఎస్ఎస్‌సి ఒబ్‌సెర్వర్ | - అలా - | 06 | పురుషులు & మహిళలు | 02 జూలై 1996 & 01 జూలై 2001 |
| (డి) | ఎస్ఎస్‌సి పైలట్(ఎంఆర్) | - అలా - | 03 | పురుషులు & మహిళలు | - అలా - |
| (ఇ) | ఎస్ఎస్‌సి పైలట్(ఎంఆర్ ఎక్కువ) | - అలా - | 05 | పురుషులు | - అలా - |
| (ఎఫ్) | ఎస్ఎస్‌సి లాజిస్టిక్ | 1. ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం నుంచి బిఇ/బి.టెక్ ఏదేని విభాగములో మొదటి శ్రేణి ఉత్తీర్ణత లేదా 2. మొదటి శ్రేణి ఎంబిఎ 3. పిజి డిప్లొమా ఫైనాన్స్ / లాజిస్టిక్స్/సప్లై చైన్ మేనేజ్‌మెంట్/మెటీరియల్ మేనేజ్‌మెంటుతో పాటు బిఎస్‌సి(బి.కాం), బిఎస్‌సి (ఐటి) మొదటి శ్రేణి లేదా 4. మొదటి శ్రేణితో ఎంసిఎ/ఎంఎస్‌సి (ఐటి) | 14 | పురుషులు & మహిళలు | 02 జూలై 1995 & 01 జనవరి 2001 |
| (జి) | ఎస్ఎస్‌సి X (ఐటి) | ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వవిద్యాలయం మంచి కనీసం 60% మార్కులతో కంప్యూటర్ సైన్సు/కంప్యూటర్ ఇంజనీరింగు/ఐటిలో బిఇ/బి.టెక్ 2. మొదటి శ్రేణి బిఎస్సీ(ఐటి) 3. ఎమ్ఎస్సీ కంప్యూటర్/ఐటి) మొదటి శ్రేణి 4. మొదటి శ్రేణి ఎమ్.టెక్ (కంప్యూటర్ సైన్సు) 5. మొదటి శ్రేణి ఎమ్‌సిఎ | 15 | పురుషులు | 02 జూలై 1995 & 01 జనవరి 2001 |
| టెక్నికల్ బ్రాంచ్ | | | | | |
| (హెచ్) | ఎస్ఎస్‌సి ఇంజనీరింగ్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్ జిఎస్) | ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం మంచి కనీసం 60% మార్కులతో క్రింది కోర్సులలో బిఇ/బి.టెక్ 1. మెకానికల్ 2. మెరైన్ 3 ఇన్‌స్ట్రుమెంటేషన్ 4. ప్రొడక్షన్ 5. ఏరో నాటికల్ 6. ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ & మేనేజ్‌మెంటు 7. కంట్రోల్ ఇంజనీరింగ్ 8. ఎరోస్పేస్ 9. ఆటోమొబైల్స్ 10. మెటలర్జీ 11. మెకట్రానిక్స్ 12. ఇనుస్ట్రుమెంటేష్ & కంట్రోల్ | 24 | పురుషులు | 02 జూలై 1995 & 01 జనవరి 2001 |
| (జె) | ఎస్ఎస్‌సి ఎలక్ట్రికల్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్ జిఎస్) | ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం మంచి కనీసం 60% మార్కులతో క్రింది కోర్సులలో బిఇ/బి.టెక్ 1. ఎలక్ట్రికల్ 2. ఎలక్ట్రానిక్స్ 3. టెలి కమ్యూనికేషన్ 4. ఎలక్ట్రానిక్స & కమ్యూనికేషన్ 5. పవర్ ఇంజనీరింగ్ 6. పవర్ ఎలక్ట్రానిక్స్ 7. ఎలక్ట్రానిక్స్ & ఇనుస్ట్రుమెంటేషన్ 8. ఇనుస్ట్రుమెంటేషన్ & కంట్రోల్ 9. ఇనుస్ట్రుమెంటేషన్ | 24 | పురుషులు | 02 జూలై 1995 & 01 జనవరి 2001 |
| ఎడ్యుకేషన్ బ్రాంచ్ | | | | | |
| | | 1. బిఎస్సీల ఫిజిక్స్‌తో ఎమ్ఎస్సీతో ఎమ్ఎస్‌సి (మ్యాచ్స్ ఆపరేషన్ రీసెర్చ్)లో మొదటి శ్రేణి | 05 | పురుషులు | |
| | | 2. బిఎస్‌సిలో మ్యాథ్స్‌తో ఎమ్ఎస్‌సి (ఫిజిక్స్/న్యూక్లియర్‌ఫిజిక్స్)ల మొదటి శ్రేణి | 03 | పురుషులు | |
| | | 3. ఎమ్ఎస్‌సి (మిటియోరాలజీ/ఓషనాలజీ/అట్మాస్ఫియరిక్ సైన్సు/లో మొదటి శ్రేణి | 02 | పురుషులు | |
| (కె) | పిసి ఎడ్యుకేషన్ | 4. ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం నుంచి కనీసం 60% మార్కులతో బిఇ/బిటెక్ కంప్యూటర్‌సైన్సు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్) | 02 | పురుషులు | 02 జూలై 1995 & 01 జూలై 1999 |
| | | 5. ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం నుంచి కనీసం 60% మార్కులతో బిఇ/బిటెక్ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేష్ /ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ & ఇనుస్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ & టెలి కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్) | 03 | పురుషులు | |
| | | 6. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఎఐసిటిఇ గుర్తింపు పొందిన సంస్థ/విశ్వ విద్యాలయం నుంచి కనీసం 60% మార్కులతో బిఇ/బిటెక్ | 03 | పురుషులు | |
| | | గమనిక: ఎడ్యుకేషనల్ ఎంట్రీలో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తరగతి Xమరియు తరగతి 12లలో కనీసం 60% మార్కులు పొంది ఉండి తరగతి 10 లేదా తరగతి 12లల ఆంగ్లంల 60% మార్కులు పొంది ఉండాలి. | | | |

**ఆన్‌లైన్ నమోదు**

18 మే 2019 నుండి 29 మే 2019 వరకు చేసుకోగలరు







గమనిక:
1. పైన పేర్కొన్న ఖాళీలు తాత్కాలికం మరియు శిక్షణ స్లాట్‌ల లభ్యతను బట్టి ఖాళీలు మారవచ్చు.
2. కమర్షియల్ పైలట్ లైసెన్సు (సిపిఎల్) కల్గిన అభ్యర్థులు డిజిసిఎ (భారతదేశం) ద్వారా జారీ చేయబడిన చెల్లుబడి అయ్యే మరియు ప్రస్తుత సిసిఎల్ పొందినవారు మరియు 02 జూలై 1995 నుంచి 01 జూలై 2001 (రెండు తేదీలు కలుపుకొని) మధ్య జన్మించిన వారు పైలట్ ఎంట్రీ కొరకు పారా 2 (డి) & 2(ఇ)లో తెలుపబడిన అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోగలరు.

davp 10701/11/0005/1920

గమనిక: 1. ఆన్‌లైను నమోదు కొరకు గర్తింపు ఆధారాలు తప్పనిసరి. వివరాలకై తేది: 18 మే 2019 ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ www.joinindiannavy.gov.in చూడగలరు.
2. మీ ఇ-అప్లికేషన్ ఫారంను సమర్పించేందుకు వెబ్‌సైట్‌లో ఇచ్చిన సూచనలు జాగ్రత్తగా చదువుకోగలరు. అభ్యర్థులు 1800-419-2929 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్‌చేసి ఆప్షను 7ను నొక్కి కస్టమర్ కేర్ రిప్రజెంటివ్‌తో సోమవారం - ఆదివారం వరకు 0800-2000 గం.ల మధ్య మాట్లాడగలరు.

ఆన్‌లైన్ దరఖాస్తుకై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com